


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 26-02-2023 సంపుటి : 04 సంచిక : 161 పేజీలు : 4 వెల : రూ 3-00


## జాతీయ స్థాయిలో ఏపీఎస్ఆర్టీసీకి మరో అవార్డు.. వరుసగా అయిదోసారి

విజయవాడ: జాతీయ స్థాయిలో ఏపీఎస్ఆర్టీసీకి మరో అవార్డు దక్కింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన డిజిటల్ టెక్నాలజీ పోటీల్లో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ విభాగంలో డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డు లభించింది.ఇటీవల ప్రవేశపెట్టిన డిజిటల్ చెల్లింపులకు గానూ ఈ అవార్డు దక్కింది.కాగా ఏపీఎస్ఆర్టీసీకి ఈ అవార్డు దక్కడం వరుసగా అయిదోసారి. కొచ్చిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోటేశ్వరరావు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (ఐటీ) శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు. ప్రయాణీకులకు ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఆర్టీసీకి ప్రశంసలు




## ఏపీ నూతన గవర్నర్ అబ్దుల్ నజీర్ ఢిల్లీ పర్యటన



ఢిల్లీ: ఏపీ నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ జస్టిటీస్ అబ్దుల్ నజీర్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన క్రమంలో మర్యాదపూర్వకంగా పలువురు ప్రముఖులతో గవర్నర్ సమావేశం కానున్నారు.ఈ మేరకు ఈరోజు(శనివారం) మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో గవర్నర్ నజీర్ సమావేశమయ్యారు. సాయంత్రం గం. 6.15 ని.లకు ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను కలవనున్నారు.రేపు(ఆదివారం) మధ్యాహ్నం గం. 12.30ని.లకు ప్రధాని నరేంద్ర మోదీతో గవర్నర్ నజీర్ సమావేశమవుతారు. అనంతరం రేపు సాయంత్రం గం. 6.30 ని.లకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో నజీర్ భేటీ కానున్నారు.

# నితీష్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన అమిత్ షా..

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశానికి ప్రధాన మంత్రి కావాలనే కోరికతోనే నితీష్ కుమార్ కాంగ్రెస్, ఆర్జేడీతో చేతులు కలిపారని తీవ్ర విమర్శలు చేశారు.ఆయన ప్రధాని కావాలనే ఆశయాలకోసం అభివృద్ధి కారకుడి నుంచి అవకాశవాది అయ్యారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.కాగా, హోం మంత్రి అమిత్ షా బీహార్ పర్యటనలో ఉన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ చంపారన్‌లో బీజేపీ శ్రేణులు తలపెట్టిన సభలో అమిత్ షా ప్రసంగించారు. సభలో అమిత్ షా మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని ప్రజలు అతిపెద్ద పార్టీగా నిలబెట్టారు. ప్రధాని మోదీ



తాను ఇచ్చిన మాట కోసం నితీష్‌కు సీఎంను చేశారు. కానీ నితీష్ మాత్రం మూడేళ్లకోసారి ప్రధాని కావాలనే కలలు కంటున్నారు. నితీశ్ కుమార్‌కు బీజేపీలో తలుపులు శాశ్వతంగా మూసుకుపోయాయి. కేవలం పదవీ కాంక్ష కోసమే నితీష్.. కాంగ్రెస్, ఆర్జేడీతో చేతులు కలిపారు. ఆర్జేడీ, జేడీ(యూ) కలయిక చమురు, నీరు వంటిది. ఈ రెండు పార్టీల కూటమి అపవిత్ర కూటమి అంటూ అమిత్ షా ఎద్దేవా చేశారు. నితీశ్ ప్రధాని కావాలనే ఆశయం బీహార్‌ను విభజించిందని ఘాటు విమర్శలు చేశారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఫైరయ్యారు. బీహార్‌ను జంగిల్ రాజ్‌గా మార్చారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.బీహార్‌లో కల్తీ మద్యం తాగి ప్రజలు మరణిస్తుంటే నితీష్ సర్కార్ ఏం చేసిందని ప్రశ్నించారు. బీహార్‌ను నితీష్, లాలూ కూటమి అభివృద్ధి చేయలేదని అన్నారు. బీహార్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. పూర్తి మెజార్టీతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైందని ఆసక్తికర కామెంట్స్ చేశారు. గత ఎన్నికల్లో కూడా జేడీయూ కంటే బీజేపీకే ఎక్కువ సీట్లు వచ్చాయన్నారు.

# 29న టీటీడీపీ బహిరంగసభ


హైదరాబాద్, ఫిబ్రవరి 25, ఖమ్మం బహిరంగసభ తర్వాత తెలంగాణ తెలుగుదేశం పార్టీ సైలెంట్ అయింది. మళ్లీ మార్చిలో భారీ బహిరంగసభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుటోంది. ఈ సభకు కూడా టీడీపీ అధినేత చంద్రబాబు హాజరు కానున్నారు. మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం. తెలుగుదేశం పార్టీని హైదరాబాద్‌లోనే ప్రారంభించారు. అందుకే హైదరాబాద్‌లోనే వ్యవస్థాపక దినోత్సవాన్ని భారీగా నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ



నేతలు ఇప్పటికే ఈ విషయంపై చంద్రబాబు అనుమతి కూడా తీసుకున్నారు. ఏర్పాట్లు ప్రారంభించనున్నారు. తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితులైన కాసాని జ్ఞానేశ్వర్ ప్రతి ఉమ్మడి జిల్లాలోనూ సభను నిర్వహించాలన్న ఉద్దేశంలో ఉన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో రాజకీయ పార్టీలు సభలు నిర్వహిస్తూ ఉంటాయి. ఇటీవల తెలంగాణ సచివాలయాన్ని ప్రారంభించిన తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లోనే సభ నిర్వహించాలని కేసీఆర్ అనుకున్నారు. కానీ సచివాలయం వాయిదా పడటంతో సభ నిర్వహణ కూడా ఆపేశారు. వచ్చే నెల 29న తెలుగుదేశం పార్టీ ఇదే గ్రౌండ్‌లో సభ నిర్వహించాలనుకుంది. తెలుగుదేశం పార్టీ ఇటీవలి కాలంలో తెలంగాణలో స్తబ్దుగా ఉంది. అయితే కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అధ్యక్షుడిగా చేసిన తర్వాత కదలిక వచ్చింది. ఖమ్మం సభను అనుకున్నదాని కన్నా ఎక్కువగా విజయవంతం చేసుకున్నామని టీడీపీ కార్యకర్తలు నమ్ముతున్నారు. వచ్చిన జనం అంతా పక్క జిల్లాల నుంచి వచ్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు. అయితే ప్రజల్లో టీడీపీపై ఇప్పటికీ సానుభూతి ఉందని.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన పార్టీ టీడీపీనేనని వారంటున్నారు. మార్చి 29న పరేడ్ గ్రౌండ్స్ సభకు కూడా భారీగా జన సమీకరణ చేసి సత్తా చాటాలని తెలుగుదేశం పార్టీ నేతలు నిర్ణయించుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీకి గట్టి బలముందని అంటున్నారు. నేతలు పార్టీలు మారి వెళ్లిపోయిన క్యాడర్, టీడీపీ సానుభూతిపరులు మాత్రం పార్టీకే అండగా ఉంటారని అంటున్నారు. ఈ క్రమంలో సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అనుకుంటున్నారు. చంద్రబాబు కూడా హాజరు కానున్నారు. ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పార్టీకి బలం ఉందని భావిస్తున్న నియోజకవర్గాల్లో పోటీ చేయాలని టీడీపీ భావిస్తోంది. కనీసం నలభై నియోజకవర్గాల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్ , ఖమ్మం నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. అందుకే ఈ ప్రాంతాల్లో సభల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణలో టీడీపీ రాజకీయాలు.. ఏపీలోనూ రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో తెలుగుదేశం పార్టీ మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తెలంగాణలో టీడీపీ ఎవరితోనైనా పొత్తులు పెట్టుకుంటుందా అన్న చర్చ ఇప్పటికే జరుగుతోంది. అయితే టీడీపీ మాత్రం ఎవరితో పొత్తులు ఉండవని చెబుతోంది. బీజేపీ కూడా ఎలాంటి పొత్తులు ఉండవని ప్రకటించింది.

# రాష్ట్రంలో రాక్షస పాలన

తిరుపతి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక హక్కులను భంగపరుస్తున్నారు. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, సేవ చేసేందుకు ప్రతిపక్షాలు ఉన్నాయి. రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డిపై 11 ఛార్జీషీట్లు నమోదయ్యాయి. జగన్మోహన్ రెడ్డి చరిత్ర అవినీతి మయం, అక్రమార్జన. ఇలాంటి వ్యక్తి ఆధ్వర్యంలో రాష్ట్ర పాలన జరుగడం దురదృష్టకరం. రూల్ ఆఫ్ లా ను చేతుల్లోకి



తీసుకున్నారు. పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చు... మైక్ లాక్కోవడం , స్టూల్ ను లాక్కోవడం లాంటి పనులు ఏపీలోనే చూస్తున్నాం. మీడియాను నియంత్రిస్తున్నారు. రాజ్యాంగానికి లోబడే పాలన ఉండాలి.... అందుకు విరుద్ధంగా ఏపీలో పాలన నడుస్తోందని అన్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి రెడ్డి, చంద్రబాబు, మాజీ ప్రధాని చంద్రశేఖర్ పాదయాత్రలు చేసినా ఎవరూ అడ్డుకోలేదు. రాజ్యాంగమే దేశానికి ప్రధానం. జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగం పట్ల అవగాహన లేదు, రాజ్యాంగ విరుద్ధంగా నియామకమైన సలహాదారుల సలహాలతో పాలన నడుస్తోంది. ఇసుక, మద్యం, మైన్స్ ను దోపిడీ చేస్తున్నది జగన్మోహన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి మనుషులే సహజ వనరులను దోపిడి చేస్తున్నారని అన్నారు.రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇండస్ట్రీస్ తీసుకువచ్చింది. ఒక్క కంపెనీ పేరు చెప్పగలరా. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగం పెరిగింది. వైకాపా ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనలో ఒక రూపాయి పెట్టుబడులను రాష్ట్రానికి తెచ్చారా. ఏపీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదు. వాలంటీర్ ఉద్యోగాలు వైసిపి కార్యకర్తలకు ఇచ్చారు. బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. పేద వర్గాలను నిండా అప్పుల ఊబిలోకి నింపుతున్నారు. దేశంలో ఏపీ పేదరికం, అరాచకం, అక్రమాలలో ముందుందని అన్నారు.రాష్ట్రంలో అప్పులు .11 లక్షల కోట్లు అప్పు ఉంది. రాష్ట్రానికి తీసుకువచ్చిన అప్పులు ఏమయ్యాయి. వివేకానంద రెడ్డి హత్యకు చంద్రబాబు కు సంబంధం ఏమిటి. వివేకానంద రెడ్డి హత్యను ఎవరు చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. వివేకానంద రెడ్డి హత్యను జగన్మోహన్ రెడ్డి చేయించారని త్వరలో నిరూపణ కానుంది. లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పాదయాత్రలో వచ్చిన ప్రజల సమస్యలను టిడిపి మ్యానిఫెస్టోలో చేర్చుతాం. రాష్ట్రంలో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అదానీ కంపెనీలలో జగన్మోహన్ రెడ్డికి వాటాలు ఉండడం వల్లే ఏపీలో ముందుకు వస్తున్నారని అన్నారు.

## ఏపీలో గ్రూప్-2.. గ్రూప్-3 ఉద్యోగాలు.. నియామక ప్రక్రియలో కొత్త నిబంధనలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)నిర్వహించే గ్రూపు-2, గ్రూపు-3 ఉద్యోగాల నియామక ప్రక్రియలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రూపు-2, గ్రూపు-3 ఉద్యోగాల నియామకానికి ఇకపై కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు (సీపీటీ) సర్టిఫికెట్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీ సాంకేతిక విద్యా మండలి నిర్వహించే సీపీటీ పాస్ సర్టిఫికెట్ లేకుండా గ్రూపు-2, గ్రూపు-3 సర్వీసుల్లో నియామకానికి అవకాశం లేదంటూ అడహాక్ నిబంధనలు జారీ చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా గ్రూపు-2, గ్రూపు-3 ఉద్యోగాలకు నియమితులయ్యే వారంతా సీపీటీ పాస్ కావాల్సిందేనని స్పష్టం చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.వంద మార్కులకు గానూ సీపీటీ నిర్వహించనున్నట్టు సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 100 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 30 మార్కులు, బీసీలు 35, ఓసీలు 40 మార్కులు సాధించాల్సి ఉంటుంది. కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలు, ఆపరేటింగ్ సిస్టమ్స్ విండోస్, ఇంటర్నెట్ తదితర అంశాల్లో పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రూపు-1 ఉద్యోగాలకు ఈ తాత్కాలిక నిబంధనలు వర్తించవంటూ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## 'అప్పర్‌భద్ర'ను జగన్, కేసీఆర్ క్రికెట్ మ్యాచ్‌లా చూస్తున్నారు: బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కర్నూలు: కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ఎడారిగా మారుతుందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.ఈ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాల నీటి వాటాకు తీవ్ర అన్యాయం వాటిల్లుంతోందని ఆరోపించారు. అప్పర్‌భద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా కర్నూలు జిల్లాలో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం నుంచి పాదయాత్ర చేపట్టారు. రాజోలి ఆనకట్ట నుంచి ఆదోని వరకు 3 రోజులపాటు ఈ పాదయాత్ర కొనసాగనుంది.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ.. అప్పర్‌భద్ర నిర్మాణాన్ని ఏపీ సీఎం జగన్ తెలంగాణ సీఎం కేసీఆర్ క్రికెట్ మ్యాచ్‌లా చూస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు విషయమై తెలుగు రాష్ట్రాల సీఎంలు అత్యవసర భేటీ ఏర్పాటుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపాలని కోరారు. రాయలసీమ ఎంపీలు, ఎమ్మెల్యేలు అప్పర్‌భద్రను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ప్రత్యేక రాయలసీమ డిమాండ్ లేవనెత్తుతామని హెచ్చరించారు. దీనిపై రాయలసీమ నియోజకవర్గాల్లో ప్రజల నుంచి సంతకాలు సేకరించి కేంద్రానికి పంపిస్తామన్నారు.

## విద్యుత్ ఛార్జీలు తగ్గించమంటే కాల్చి చంపిన చరిత్ర చంద్రబాబుది: మంత్రి సీదిరి

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు ఏం చేశాడో చెప్పాలి. మళ్లీ ఏ మొహం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతాడు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబును ప్రజలు తరిమికొడతారు అంటూ మంత్రి సీదిరి అప్పలరాజు సీరియస్ కామెంట్స్ చేశారు.మంత్రి అప్పలరాజు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో టీడీపీని 23 సీట్లతో ప్రజలు ఓ మూలన కూర్చోబెట్టారు. 2024లో చంద్రబాబుకు ప్రజలు మళ్లీ బుద్ధిచెబుతారు. ప్రజాస్వామ్యం గురించి చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటు. విద్యుత్ ఛార్జీలు తగ్గించమని అడిగితే కాల్చి చంపిన చరిత్ర చంద్రబాబుది. గతంలో ఎమ్మెల్యేలకు ప్యాకేజీలు ఇచ్చి లాక్కున్న చంద్రబాబు.. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. ముద్రగడ కుటుంబాన్ని చంద్రబాబు వేధించలేదా?. దమ్ముంటే రండి తేల్చుకుందామని చంద్రబాబు తొడగొడుతున్నాడు. 14ఏళ్లు సీఎంగా చేసి వ్యక్తి మాట్లాడాల్సిన మాటలా ఇవి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.తన హయంలో చంద్రబాబు చేసిన ఒక్క పని గురించైనా చెప్పగలడా.. ఒక్క మంచి పథకం పేరైనా చెప్పగలడా?. ప్రజలకు చంద్రబాబు ఏం మేలు చేశాడో చెప్పాలి. ఒక్క కుటుంబానికైనా మంచి చేశానని చంద్రబాబు చెప్పగలడా?. సైకో చంద్రబాబును ప్రజలు తరిమికొట్టాల్సిన అవసరం ఉంది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# సంపాదకీయం

ఆదివారం 26-02-2023

## మానవీయ విదేశాంగ విధానంతో మోడీ

టర్కీ, సిరియా, ఆఫ్ఘనిస్తాన్, యెమెన్‌లో రెస్క్యూ ఆపరేషన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఉక్రెయిన్‌లో రెస్క్యూ ఆపరేషన్, కోవిడ్ కాలంలో ఇస్లామిక్ దేశాలైన సౌదీ, యుఎఇ, ఒమన్ నుండి రెస్క్యూ ఆపరేషన్..ఇలా వరుస ఆపరేషన్ లతో అందరి మెప్పు పొందే ప్రయత్నం చేస్తోంది భారత్.టర్కీ అంతటా హిందుస్థాన్ జిందాబాద్ నినాదాలు మిన్నంటడం చూస్తుంటే.. ప్రధాని మోదీ తీసుకున్న ప్రత్యేక చొరవ దీనికి కారణంగా కనిపిస్తోంది.. మోదీ దేవదూతలా అక్కడివారికి కనిపిస్తున్నారు. భూకంపం వచ్చి ఆ దేశం అతలాకుతలమైన తర్వాత.. చాలా వేగంగా స్పందించి సహాయక బృందాలను పంపిన మొదటి దేశం భారత్ నిలిచింది. టర్కీ భూకంపం వార్త తెలిసిన వెంటనే ప్రధాని మోదీ 152 మంది సభ్యులతో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని అక్కడికి పంపించారు.మోడీ ప్రభుత్వంలో ఇస్లామిక్ దేశాలలో చాలా రెస్క్యూ ఆపరేషన్లు జరిగాయి. అయితే అనేక ఇస్లామిక్ దేశాలు అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌తో కలిసి భారతదేశానికి వ్యతిరేకంగా వాతావరణాన్ని సృష్టిస్తూనే ఉన్నాయి. అయితే సంక్షోభ సమయాల్లో ప్రధాని నరేంద్ర మోదీ అల్లర్లకు ఈ కారణాలన్నింటినీ మరచిపోయి కేవలం మానవీయ విదేశాంగ విధానాన్ని మాత్రమే ముందుకు తెచ్చారు.జవాబ్ ఆపరేషన్ దోస్త్ తర్వాత భారతీయులు తిరిగి వస్తున్నప్పుడు, టర్కీ ప్రజలు కన్నీళు పెట్టుకున్నారు. వారు పదే పదే ధన్యవాదాలు చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా విపత్తు సంభవించినట్లయితే, భారతదేశం మొదట సహాయం చేస్తుందని అతను ఖచ్చితంగా చెప్పారు. పాకిస్థాన్, టర్కీని తన మిత్రుడు అని పిలుచుకుంటుంది. కానీ సహాయం పేరుతో, షెహబాజ్ షరీఫ్ తనతో పాటు టర్కీ వరదల సమయంలో పాకిస్తాన్‌కు పంపిన రిలీఫ్ మెటీరియల్‌ను తన వెంట తీసుకెళ్లాడు. టర్కీ సరుకులను వెనక్కి పంపి షాబాజ్ ప్రపంచాన్ని తలదించుకునేలా చేస్తోంది. పాకిస్తాన్ సహాయం చేసినట్లు మాత్రమే నటిస్తుంది. ఆపరేషన్ దోస్త్‌లో పాలుపంచుకున్న భారత రిస్క్యూ టీమ్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. వారితో ప్రత్యేకంగా భేటీ అయిన ప్రధాని.. మీ సేవలు దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశాయని కొనియాడారు. ప్రధాని మోదీ తీసుకున్న చొరవతో టర్కీ అధికారులు కూడా మరో వైపు టర్కియే కూడా భారత బృందాలకు వీసా ఆన్ అరైవల్ సౌకర్యాన్ని కల్పించింది.మొత్తానికి మహా విలయంలో చిక్కుకున్న టర్కీకి బాసటగా నిలిచిన భారత్.. యావత్ ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకుంటోంది. విపత్కర పరిస్థితుల్లో టర్కీకి నిలిచి భారత్ తన అంతర్జాతీయ పరపతిని మరింత పెంచుకుంది. ఈ దిశగా ప్రధాని మోదీ చేసిన మార్గదర్శనం దేశానికి ప్రత్యేక గౌరవాన్ని సాధించిపెట్టంది.ఉక్రెయిన్ ? రష్యాల మధ్య ఏడాదిగా సాగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు చాలా దేశాలు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయి. రష్యాతో భారత్‌కున్న బలమైన మైత్రీ సంబంధాల కారణంగా.. యుద్ధాన్ని ఆపేందుకు భారత్ చొరవ చూపాలని రెండ్రోజుల క్రితం ఫ్రాన్స్ భారత్‌ను కోరడం తెలిసిందే. అంతర్జాతీయ స్థాయిలో భారత్ పరపతి ఏపాటిదో దీంతో ఎవరైనా అర్థంచేసుకోవచ్చు. టర్కీలో రెస్క్యూ ఆపరేషన్ లో భారత్ ఉద్దేశ్యం చాలా స్పష్టంగా ఉంది. మానవాళిని అన్ని ఖర్చులతో రక్షించాలి అనేది మాత్రమే భారత్‌కు తెలుసు.. భారత్‌ను నడిపిస్తున్నప్రధాని మోదీ దార్శనికత ఇక్కడ కనిపించింది. అందుకే ప్రధాని మోదీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేనియా అలాంటిది.

## కూరగాయల వాహనంలో గంజాయి, మద్యం

తిరుమల, ఫిబ్రవరి 25, తిరుమలలో గంజాయి కలకలం రేగింది. కూరగాయల వాహనంలో గంజాయిని తరలిస్తుండగా టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం టీటీడీ విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు తిరుమలలోని జీఎన్సీ టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కూరగాయల వాహనంలో దాదాపు అర కేజీ గంజాయిని టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో వాహనంలో ఉన్న రెడ్డి, రెహమాన్ అనే ఇద్దరు యువకులను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అయితే తిరుమలలోని హోటల్స్, దుకాణాలకు నిత్యం కూరగాయలు తరలిస్తుంటారు. కూరగాయల మాటున కొద్ది కాలంగా గంజాయి తరలిస్తున్నట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో రంగంలోకి దిగిన టీటీడీ విజిలెన్స్ అధికారులు గంజాయిని కొండపై ఎవరి అందిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. తిరుమలలో ఇటీవల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు సెబ్ అధికారులు. తిరుమల ఓల్డ్ బార్బర్ క్వార్టర్స్ వద్ద 22 మద్యం బాటిల్స్ ని స్వాధీనం చేసుకున్నారు స్పెషల్ ఎన్ ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది. మద్యం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులు సుమలత, నాగేంద్ర ప్రసాద్, బిన్నీ, ప్రవీణ్ కుమార్ వద్ద నుంచి మొత్తం 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీళ్లంతా అనంతపురం జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. కాంట్రాక్టు పనుల కోసం తిరుమలకు వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమలలో ఇటీవల మాంసం తింటూ షికారీలు పట్టుబడ్డారు. వారిని తిరుమల విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. తిరుమలలో మద్యమాంసాలపై నిషేధం ఉన్నా కొందరు మాత్రం నియమాలను అతిక్రమిస్తున్నారు. నిబంధనలు పాటించే వారికేనని మాకు కాదంటూ కొందరు షికారీలు, స్థానికులు తరచూ తిరుమలలో మాసం మద్యం సేవిస్తూ పట్టుబడుతున్నారు. తిరుమలలోని షికారి వీధిలో కొందరు షికారీలు మాసం వండినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన విజిలెన్స్ సిబ్బంది ఇద్దరు షికారిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని కమాండ్ కంట్రోల్ రూమ్ కు తరలించి విచారణ చేపట్టారు. తిరుమల కొండపై మద్యం, మాంసంపై నిషేధం ఉంది. కొందరు ఈ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. తిరుమలలో మాంసం తింటూ మద్యం సేవిస్తూ పట్టుబడుతున్నారు. తిరుమలలోని షికారీ వీధిలో కొందరు షికారీలు మాంసం వండి తింటున్నట్టు టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఓ వీడియో ఇటీవల నెట్టింట హల్ చల్ చేసింది. ఈ వీడియో వైరల్ అవడంతో టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ కెమెరాల్లో శ్రీవారి ఆలయాల చిత్రీకరించిన వీడియో వైరల్ అయింది. తిరుమల శ్రీవారి ఆలయంపై, పరిసర ప్రాంతాల్లో విమానాలు, డ్రోన్ కెమెరాలు నిషేధం ఉంది. అయితే శ్రీవారి ఆలయానికి సంబంధించిన వీడియాను ఐకాన్ అనే ఓ యూట్యూబ్ ఛానల్ పోస్టు చేయడం కలకలంగా మారింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంపై శ్రీవారి భక్తులు, ఆగమ సలహాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది మంది ఆరాధ్య దైవంమైన శ్రీనివాసుడి దర్శనార్థం ప్రతినిత్యం లక్షలాది మంది భక్తులు దేశ విదేశాల నుండి తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తుంటారు. అయితే తిరుమల కట్టుదిట్టమైన భద్రత వలయాలతో పటిష్టమైన సెక్యూరిటీ కలిగిన దేవస్థానం. ప్రతినిత్యం మాన్యువల్ సెక్యూరిటీ నుంచి మూడో కన్ను వరకు అన్ని కాపు కాస్తూనే ఉంటాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హైసెక్యూరిటీ నడుమ టీటీడీ విజిలెన్స్, పోలీసు, ఆక్టోపస్ అంటూ వివిధ సెక్యూరిటీ ఫోర్స్ లతో పాటు సీసీ కెమెరాలు నిత్య పర్యవేక్షణలో తిరుమల సురక్షితంగా ఉంటుంది. ఇలాంటి హైసెక్యూరిటీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఎగరవేయ రాదనే నిబంధనలు ఉన్నాయి. ఒకవేళ అనుమతి లేకుండా డ్రోన్స్ ఎగురవేస్తే కటకటాల పాలుకావాల్సిందే. ఇక ఇప్పటికే నో ఫ్లై జోన్ గా ప్రకటించాలని టీటీడీ కేంద్ర పౌర విమానయాన శాఖను పలుమార్లు కోరింది. అయితే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసిన పౌర విమానయాన శాఖ అధికారులు అది సాధ్యం కాదని తేల్చారు. విమానం సంగతి పక్కన బెట్టిన డ్రోన్స్ ఎగరేయరాదనే నిబంధనలు మాత్రం పటిష్టంగా అమలు చేస్తుంది టీటీడీ.

## వివేకా చుట్టూ రాజకీయ రచ్చ

కడప, ఫిబ్రవరి 25, వివేకా హత్య కేసులో ఓవైపు సీబీఐ విచారణ జరుగుతోంది. దానికి సమాంతరంగా పొలిటికల్ ఇంటరాగేషన్ కూడా నడుస్తోంది! రోజుకో కొత్త అంశం తెరపైకి వస్తోంది! దాని చుట్టూ రాజకీయ రచ్చ రాజుకుంటోంది! లేటెస్ట్‌గా సునీల్‌యాదవ్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ వేసిన కౌంటర్, టీడీపీ-వైసీపీ మధ్య మరోసారి మంటల్ని రాజేసింది. ఎవరి వర్షన్‌ను వాళ్లు చాలా బలంగా వినిపిస్తున్నారు.వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు 4 ఏళ్లు కావస్తోంది. అప్పటి నుంచి ఈ కేసులో ఎన్నో మలుపులు. విషయం ఎప్పుడో పొలిటికల్ టర్న్ తీసుకుంది కూడా. దర్యాప్తు విషయంలో ఈ మధ్యే సీబీఐ దూకుడు పెంచింది. రోజుకో విషయం బయటకు వస్తోంది. ఇప్పుడు ఈ కేసులో నిందితుడుగా ఉన్న సునీల్ యాదవ్ కూడా బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కౌంటర్ పిటిషన్ వేసింది సీబీఐ. ఈ పిటిషన్‌లోని అంశాలే ఇప్పుడు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వివేకాను ఎవరు చంపారో సీబీఐ తేల్చేసింది అంటోంది తెలుగుదేశం. ఈ లీకుల వెనుక కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అంతా చంద్రబాబుదే అని ఆరోపిస్తోంది వైసీపీ.వివేకా హత్య చుట్టూ ఏపీ రాజకీయం నడుస్తోంది. సందర్భం వచ్చినప్పుడల్లా ఈ అంశాన్ని తెరపైకి తెస్తోంది తెలుగుదేశం. నేరుగా సీఎం జగన్‌ను టార్గెట్ చేస్తోంది. ఈ విమర్శలను పూర్తిగా ఖండిస్తోన్న వైసీపీ సూటిగా పలు ప్రశ్నలు సంధిస్తోంది. ఎన్నికల ముందు జగన్ క్యారెక్టర్‌ను బ్యాడ్ చేయడమే లక్ష్యంగా చంద్రబాబు అండ్ టీమ్ కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది. సీబీఐ కూడా చంద్రబాబు లైన్‌లోనే పనిచేస్తోందని సంచలన విమర్శలు చేస్తోంది.గూగుల్ టేకౌట్! ఈ పదం కూడా పొలిటికల్ రచ్చకు ముడిసరుకుగా మారిపోయింది. ఈ హత్య కేసు గుట్టుని టెక్నాలజీ విప్పేసిందన్నది టీడీపీ వర్షన్. టెలికాం ఆపరేటర్ కూడా ఆ పని చేస్తాడని, దానికి సీబీఐ ఎందుకని నిలదీస్తోంది వైసీపీ.వివేక హత్య కేసు కచ్చితంగా రాజకీయ ముడిసరుకుగా మారింది.! అందుకే పొలిటికల్ ఇంటరాగేషన్ నడుస్తోంది. జగన్‌ను టార్గెట్ చేస్తోంది టీడీపీ. దర్యాప్తు ఏకపక్షంగా, టీడీపీకి కావాల్సిన లైన్‌లో జరుగుతోందనే అంశాన్ని బలంగా తెరపైకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది వైసీపీ. వివేకా చుట్టూ నడుస్తున్న ఈ పొలిటికల్ యుద్ధం..భవిష్యత్‌లో మరింత రచ్చ రాజేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి

## వరుస సినిమాలు...బిజీబిజీగా జనసేనాని

విజయవాడ, ఫిబ్రవరి 25, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చుట్టూ ఏపీ రాజకీయాలు తిరుగుతున్నాయి. జనసేన డిసైడింగ్ ఫ్యాక్టర్ అని ఎక్కువ మంది నమ్ముతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా పవన్ కల్యాణ్ పొత్తు కోసం ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం ఇంకా పూర్తి స్థాయి రాజకీయాలు ప్రారంభించలేదు. ఇటీవల వారాంతాల్లో కూడా ఆయన ఎలాంటి కార్యక్రమాలు పెట్టుకోలేదు.కానీ వరుసగా సినిమాలు ప్రారంభిస్తున్నారు. దీంతో పవన్ కల్యాణ్ .. ఎప్పుడు వారాహి యాత్ర మొదలు పెడతారు.. ఎప్పట్నుంచి పూర్తి స్థాయి రాజకీయాలు చేస్తారన్న చర్చ ప్రారంభమయింది. పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ బ్యాక్ సినిమాలతో బిజీ బిజీగా గడుపుతున్నాడు. ప్రస్తుతం సెట్స్ మీదున్న సినిమాలను పూర్తిచేయడం దృష్టి సారించాడు. ప్రస్తుతం పవన్ 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. క్రిష్ దర్శకత్వంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో ఎక్కడలేని అంచనాలు నెలకొన్నాయి. ఇక దీనితో పాటుగా వినోదయ సిత్తం రీమేక్‌ను కూడా ప్రారంభించారు. పి. సముద్రఖని దర్వకత్వం వహించ నున్న ఈ సినిమాలో సాయి ధరమ్ తేజ్ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. హరిహర వీరమల్లును ముందుగా ఏప్రిల్‌లో అనుకున్నా.. షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండటంతో దసరాకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో పవన్‌కల్యాణ్ మానవ రూపంలో ఉన్న దేవుడి పాత్రలో కనిపిస్తారు. ఇక హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ , ఒరిజినల్ గ్యాంగ్ స్టర్ అనే వర్కింగ్ టైటిల్‌తో సినిమాను ప్రారంభించారు. వీటి షూటింగ్‌లు పూర్తి కావాలంటే ఏడాది పైనే పడుతుంది. అంటే ఎన్నికలు వచ్చేస్తాయి. మరి ఎప్పుడు పవన్ రాజకీయాల కోసం సమయం కేటాయిస్తారు. పవన్ కల్యాణ్ వారాహి యాత్రపై క్లారిటీ రావడం లేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏడాది ముందు నుంచే ఆయన ఉత్తరాంధ్ర నుంచి యాత్ర ప్రారంభించారు. ఆగుతూ సాగినా యాత్ర అయితే కొనసాగించారు. ఈ సారి మాత్రం యాత్ర ప్రారంభించడానికే పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. వారాహి పేరుతో ఓ భారీ వాహనాన్ని సిద్ధం చేసుకున్నారు. ఆ వాహనం నిబంధనలకు విరుద్ధంగా ఉందని.. అడ్డుకుంటామని అధికార పార్టీల నేతలు ప్రకటించారు. కానీ అడ్డుకోవడానికి కూడా అవకాశం ఇవ్వకుండా అసలు వారాహీ రోడ్డు మీదకు రావడం లేదు. ఇప్పుడు వైసీపీ నేతలే వారాహి రావడం లేదేమిటా అని వాకబు చేస్తున్నారు. నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నందున వారాహి రోడ్డు మీదకు రావడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జనసేనాని కూడా ప్రజల్లోకి వస్తే వైసీపీ పాలనా తీరు వ్యవహారం అంతా ప్రజల్లోకి చర్చకు వస్తుంది. ప్రభుత్వంలో ఉన్న వ్యతిరేకత అంతా బహిరంగమవుతుందని జనసే వర్గాలు చెబుతున్నాయి. పవన్ యాత్ర చేస్తే జనసేన పరిస్థితి మెరుగుపడుతుందని హరిరామ జోగయ్య కూడా చెబుతున్నారు. కారణం ఏమిటో తెలియదు కానీ.. ఎన్నికలకు ఇంకా ఏడాదికిపైగానే సమయం ఉన్నందున? చివరి ఆరు నెలలు జనంలో ఉంటే చాలని ఆయన అనుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుతం నాదెండ్ల మనోహర్ ఒక్కరే తిరుగుతున్నారు. అయితే పవన్ కల్యాణ్ కు ఉండే క్రేజ్ వేరు.. నాదెండ్ల వేరు. అయితే పవన్ కల్యాణ్ సభ్యత్వ నమోదు ఇతర పార్టీ అంతర్గత అంశాలపై రోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారని.. రాజకీయ వాతావరణానికి తగ్గట్లుగా ఆయన నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు.

## ఆ లెటర్ లో ఏముంది

హైదరాబాద్, ఫిబ్రవరి 25, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో సారి సీబీఐ విచారణకు హాజరైన వైఎస్ అవినాష్ రెడ్డి సీబీఐ అధికారులకు ఓ ప్రత్యేకమైన లేఖ అందించినట్లుగా తెలుస్తోంది. వివేకా హత్య కేసులో తనకు తెలిసిన సమాచారంతో పాటు తనకు ఉన్న సందేహాలను అందులో పేర్కొన్నానని అవినాష్ రెడ్డి చెబుతున్నారు. హత్య కేసులో తనకు తెలిసిన సమాచారం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాను చెప్పాలనుకున్నది సీబీఐకి చెప్పవచ్చు కదా.. ప్రత్యేకంగా లేఖ ఇవ్వడం ఎందుకన్నది కూడా ఆసక్తి రే?పతోంది. విచారణ తర్వాత మీడియాతో మాట్లాడిన అవినాష్ రెడ్డి సీబీఐ తీరుపై చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌తో పాటు సీబీఐ డైరక్టర్‌కూ లేఖ రాశానని అవినాష్ రెడ్డి మీడియాకు చెప్పారు. సీబీఐ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని.. విచారణ సమయంలో ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని కోరాను , కానీ రికార్డ్ చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసు రోజు మీడియాతో మొట్ట మొదట గా మాట్లాడింది తానేనన్నారు. ఆ రోజు ఇచ్చిన స్టేట్మెంట్‌కు కట్టుబడి ఉన్నానని.. ఇప్పుడు కేసు విచారణ వ్యక్తి టార్గెట్ గా నడుస్తుందన్నారు. మొదటి సారి విచారణ కు వచ్చినప్పుడు మరో సారి రావాలని చెప్పారు కానీ ఇప్పుడు విచారణ ముగిసిన తరువాత మరోసారి విచారణకు రావాలని ఏమి చెప్పలేదని అవినాష్ రెడ్డి మీడియాకుచెప్పారు. వివేకా హత్య కు సంబంధించి నా దగ్గర ఉన్న సమాచారాన్ని ఇచ్చాను …మీడియాలో వస్తున్న కథనాలతో సీబీఐ విచారణ పై ప్రభావం పడుతోందన్నారు. తనకు 160సీఆర్పీసి కింద ఇచ్చిన నోటీస్ ఇచ్చారని.. తనను సాక్షిగా విచారిస్తున్నారో, నేరస్తుడిగా విచారిస్తున్నారా తెలీదని చెప్పుకొచ్చారు. టిడిపి సంవత్సరం కింద చెప్పిన అంశంలనే సి బి ఐ కౌంటర్ లో చెప్పిందన్నారు. వివేక మర్డర్ జరిగిన రోజు దొరికిన లెటర్ ఎందుకు దాస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆ లేఖ ను బయటికి తీసుకురావాలని కోరుతున్నానని మీడియాకు చెప్పారు. తన విచారణలో ఎక్కడ ఆడియో వీడియో రికార్డింగ్ లేదని.. న్యాయవాదులను అనుమతించాలని కోరాను అందుకు సిబిఐ ఒప్పుకోలేదని ఆయన చెబుతున్నారు. సీబీఐ అధికారులు చెబుతున్న గూగుల్ టెక్ ఔట్ .. టీడీపీ టెక్ ఔట్ అయి ఉంటుందని అసహనం వ్యక్తం చేశారు. విచారణ పూర్తిగా ఏక పక్షంగా జరుగుతోందన్నారు. గత విచారణలో కాల్ డేటా ఆధారంగా విచారణ జరిపారు. ఆ సమయంలో సీఎం జగన్, ఆయన సతీమణి భారతిల పీఏలకు ఫోన్ చేసినట్లుగా తెలిపారు. దీంతో వారినీ సీబీఐ విచారించింది. శుక్రవారం నాటి విచారణలో బ్యాంక్ లావాదేవీలపై సీబీఐ అధికారులు ఆరా తీస్తున్నట్లుగా తెలుస్తోంది. దస్తగిరి ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్మెంట్‌ను ప్రస్తావిస్తూ అవినాష్‌ను విచారిస్తున్నరని అంటున్నారు. వివేకా హత్యకేసులో అవినాష్ పాత్ర కీలకంగా ఉందని సీబీఐ భావిస్తోంది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.

## గుంటూరు నేతల్లో కన్నా టెన్షన్



గుంటూరు, ఫిబ్రవరి 25, సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకుని ఆయన తనకు సుదీర్ఘకాలం విరోధిగా ఉన్న పార్టీ కండువాను కన్నా కప్పేసుకుంటున్నారు. దాదాపు పదేళ్ల పాటు చట్టసభల్లోకి అడుగుపెట్టలేకపోవడం కన్నాను నిద్రపోనివ్వడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ ను వీడి బీజేపీలో చేరినా ప్రయోజనం లేదు. అందుకే 2024 ఎన్నికల్లోనైనా గెలిచి శాసనసభలో అడుగుపెట్టి పాలిటిక్స్ లో తన పవర్ తగ్గలేదని చెప్పాలనుకుంటున్నారు కన్నా లక్ష్మీనారాయణ. అందుకే టీడీపీలో చేరడానికి డిసైడ్ అయిపోయారు. ఆయన సీనియర్ నేతగా... నిజానికి కన్నా లక్ష్మీనారాయణ ఆషామాషీ నేత కాదు. అయితే అది ఒకప్పుడు. ఈ పదేళ్లలో గుంటూరు జిల్లా రాజకీయాల్లో కొత్త తరం పుట్టుకొచ్చింది. కన్నా తన వెంట అనుచరులు ఉన్నారని అనుకుంటున్నా ఓటు బ్యాంకు ఏ మేరకు ఉంటుందన్నది చెప్పలేం. ఎందుకంటే జాతీయ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట ఎంపీ స్థానానికి పోటీ చేసినప్పుడే ఆయన తనకున్న అసలు బలం ఏంటో తెలిసిపోయింది. ఆ ఎన్నికల్లో తన కులం ఓట్లు కూడా తనకు పడలేదు. దీంతో ఆయన టీడీపీలో చేరిపోవడానికి సిద్ధమయి పోయారు. ఏ రాజకీయ నాయకుడైనా తనకు ఓపిక ఉన్నంత వరకూ పాలిటిక్స్ లో క్రియాశీలకంగానే ఉండాలనుకుంటారు.అదీ జనసేన పార్టీ పెట్టడంతో కాపులకు ప్రాధాన్యం పెరిగింది. టీడీపీ అధికారంలోకి వస్తే కన్నా లక్ష్మీనారాయణకు చంద్రబాబు మంచి పదవే ఇస్తారన్న టాక్ కూడా ఉంది. పార్టీలో కూడా నెంబర్ టూ గా ఎదిగే అవకాశాలు లేకపోలేదు. అయితే చినబాబు ఇన్‌ఫ్లూయెన్స్ తట్టుకుని కన్నా లక్ష్మీనారాయణ ఎంత మాత్రం నిలబడగలరన్నదే ఇప్పుడు ప్రశ్న. నాడు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సీనియర్ నేతలు కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు లాంటి వారే ఇబ్బందులు పడ్డారు. మరి కన్నా వారితో పోలిస్తే ఎంత అన్న అనుమానాలు ఆయన అనుచరుల నుంచి గుసగుసలుగా వినిపిస్తున్నాయి మరోవైపు కన్నా లక్ష్మీనారాయణకు కాపు కోటాలో మంత్రి పదవి లభిస్తే, తమ పరిస్థితి ఏంటని ప్రస్తుతం టీడీపీలో ఉన్న కాపు నేతలు గాబరాలోనే ఉన్నారు. ప్రధానంగా కాపుల్లో చిన రాజప్ప, బొండా ఉమామహేశ్వరరావు, వంగవీటి రాధా లాంటి నేతలు కన్నా వస్తే అంతంత మాత్రంగానే ఉన్న తాము వెనకబడి పోవడం ఖాయమని లోలోపల మధనపడుతున్నారు. అలాగని తమ మనసులో మాటను బయటకు చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. టీడీపీలో కాపు సామాజికవర్గం నేతల్లో కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య భూమిక పోషిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి ఇన్నాళ్లూ పార్టీ జెండాను మోసిన తెలుగు తమ్ముళ్ల పరిస్థితి ఏంటన్నది మాత్రం అర్థం కాకుండానే ఉంది. ఇలా కన్నా లక్ష్మీనారాయణ చేరిక సొంత పార్టీలోని నేతల్లోనే గుబులు పుట్టిస్తుంది. మరి ఏం జరుగుతుందనేది కాలమే చెప్పాల్సి ఉంటుంది.

### వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్దిగా మేరిగా మురళీధర్

నెల్లూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి విధేయులుగా ఉన్న మేరిగా మురళీధర్ కష్టానికిదగ్గ ఫలితం లభించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడుగా,గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త బాధ్యతలు చేపట్టి పార్టీ కోసం కోట్లాది రూపాయలుఖర్చు చేసి కష్టకాలంలో జగనన్న వెంట నడిచారు. 2014, 2019 లో వైసీపీ టికెట్ తృటిలో చేజారింది.అయినా పార్టీ పై విమర్శలు చేయలేదు పార్టీ ఉన్నతికి కృషి చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ గా వైసీపీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.కానీ దురదృష్టం రెండు తెలుగు రాష్ట్రాలతో ఆ పదవీ ముడి పడిన కారణంగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. అయినా నిరుత్సాహం చెందలేదు.గూడూరు లోనే ఉంటూ పార్టీకి సేవలు చేస్తూ వైసీపీనాయకులు,కార్యకర్తలు,అభిమానులకు అందుబాటులో ఉంటూ పార్టీకి విధేయుడుగా ఉన్నారు.ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో మేరిగా మురళీధర్ ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల వైకాపా అభ్యర్ధిగా ప్రకటించారు. ఆ తరువాత ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి వైసిపి అభ్యర్ధి మేరుగ మురళి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డితో కలిసి నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన మేరుగ మురళి రిటర్నింగ్ అధికారి అయిన జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మేరిగా మురళీధర్ తో పాటు మరో ఇండిపెండెంట్ అభ్యర్ధి కూడా నామినేషన్ దాఖలు చేశారు.

## మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవం

అనంతపురం, ఫిబ్రవరి 25, నామినేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాక ముందే వైసీపీ ఓ విజయం నమోదు చేసుకుంది. ఎన్నికలు జరగకుండానే ఓ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైసీపీ ఓ స్థానాన్ని ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ఎస్ మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమెను ఖరారు చేశారు. అనంతపురం జిల్లాలో నిన్నటి వరకు నిన్నటి వరకు నామినేషన్లు స్వీకరించారు. వచ్చిన నామినేషన్లను స్క్రూటినీ చేశారు. వాటిలో చాలా నామినేషన్లను సరైన వివరాలు లేవని తిరస్కరించారు. అలా తిరస్కరించిన వాటిలో టీడీపీ లీడర్ నామినేషన్ కూడా ఉంది. సరైన వివరాలు ఇవ్వలేదన్న కారణంతో టీడీపీ అభ్యర్థి వేలూరు రంగయ్యసహా పలువురు నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన తర్వాత ఒక్క మంగమ్మ నామినేషన్ మాత్రమే మిగిలింది. ఎన్నికల సంఘం చెప్పిన రూల్స్ ప్రకారం ఉన్న ఆ ఒక్క నామినేషన్‌ను మాత్రమే అధికారులు అంగీకరించారు. దీంతో పోటీగా అభ్యర్థులు లేకపోవడంతో ఆమె ఎన్నికల లాంఛనం కానుంది. ప్రక్రియ పూర్తైన తర్వాత మంగమ్మ ఎన్నికను అధికారులు ప్రకటించనున్నారు. మరోవైపు నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడాన్ని ఆ పార్టీ లీడర్లు తప్పుబడుతున్నారు. కావాలనే అధికారులు నామినేషన్లు తిరస్కరించారని ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై న్యాయస్థానాన్నిఆశ్రయిస్తామంటున్నారు టీడీపీ అభ్యర్థి రంగయ్య.

# ఏపీలో కమలం దారెటు...

విజయవాడ, ఫిబ్రవరి 25, తెలుగుదేశం పార్టీతో పొత్తు విషయంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పెద్దలు ఓ క్లారిటీకి వచ్చేసినట్టేనా? ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ అలాగే కనిపిస్తున్నాయి. కమలనాథులతో పొత్తు ఆశిస్తున్న తెలుగుదేశం పార్టీకి నిరాశే ఎదురవుతోంది. పొత్తులు, కూటములు వంటి అంశాలు సాధారణంగా ఎన్నికల వేళ చర్చకొస్తాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో పొత్తుల రాజకీయాలు చాలా ముందే మొదలయ్యాయి. 2020లోనే బీజేపీ-జనసేన కలిసి కూటమిగా ఏర్పడగా.. ఆ రెండు పార్టీలు తమతో కలవాల్సిందిగా తెలుగుదేశం పార్టీ సైతం చాలాకాలంగా కోరుతూ వస్తోంది. విడివిడిగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి, అంతిమంగా అది వైఎస్సార్సీపీకే మేలు చేస్తుందని చెబుతోంది. 2014 మాదిరిగా తెలుగుదేశం-బీజేపీ-జనసేన కూటమి కలిసి పోటీ చేస్తే మళ్లీ అధికారం సాధించవచ్చని గుర్తుచేస్తోంది. ఈ ప్రతిపాదనలకు జనసేన కాస్త మెత్తబడినట్టు కనిపిస్తున్నా? బీజేపీ మాత్రం ఏ కోశానా మెత్తబడ్డ సంకేతాలు ఇవ్వలేదు. ఏమాత్రం ఊగిసలాటను కూడా ఎన్నడూ ప్రదర్శించలేదు. పైపెచ్చు.. హస్తిన నుంచి అధిష్టానం పెద్దలు పార్టీ గెలిచినా, గెలవకున్నా.. టీడీపీతో మాత్రం పొత్తు ప్రసక్తి ఉండదనే చెబుతూ వచ్చారు. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీలో ఏ మూలనో ఆశలు సజీవంగానే ఉన్నాయి. కమలనాథులు ఇప్పటికిప్పుడు మెత్తబడకపోయినా.. ఎన్నికలు సమీపించిన తర్వాత ఓకే చేస్తారన్న ఆశతో ఉంది. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే.. ఇక ఆశలు వదులుకోక తప్పదని అర్థమవుతోంది. ఎన్డీయేను వీడి వెళ్లే క్రమంలో నాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వ్యవహరించి తీరును మోదీ-షా నాయకత్వం ఇప్పటికీ మర్చిపోలేకపోతోందని ఆ పార్టీ నేతలు చెబుతుంటారు.రాజకీయాల్లో ఏ పార్టీతోనైనా పొత్తులు పెట్టుకోవాలంటే ఆ పార్టీ బలాబలాలను బేరీజు వేసుకుంటారు. పొత్తుతో తమకు ఏం కలిసొస్తుంది? ఎంత మేర ఓట్లు అదనంగా వచ్చి చేరతాయన్న లెక్కలు వేసుకుంటారు. కనీసం 5% ఓటు బ్యాంకు ఉన్నా సరే.. పొత్తు పెట్టుకుంటే ఆ ఓటుబ్యాంకు కలిసి మొత్తం ఫలితాలనే తారుమారు చేయవచ్చని భావిస్తుంటారు. ఈ సూత్రం ప్రకారం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 5.53% ఓట్లు సాధించిన జనసేనతో తెలుగుదేశం పార్టీ పొత్తు కోరుకోవడం తప్పేమీ కాదు. ఆ ఎన్నికల్లో దాదాపు 50% ఓటుబ్యాంకును కైవసం చేసుకున్న వైఎస్సార్సీపీని దెబ్బకొట్టాలంటే మిగతా ఓటుబ్యాంకు అంతా ఒక్కచోటకు

**పొత్తులపై తేల్చని అధిష్టానం**



చేర్చక తప్పదు. తెలుగుదేశం పార్టీ సరిగ్గా అదే వ్యూహంతో అడుగులు వేస్తోంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ కనీసం 1% కూడా ఓటుబ్యాంకు లేని స్థితిలో ఉంది. జాతీయస్థాయిలో ప్రధాని మోదీ హవాతో రెండోసారి మరిన్ని ఎక్కువ సీట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి గతంలో గెలుచుకున్న ఎంపీ సీట్లను కూడా నిలబెట్టుకోలేకపోయింది. అంటే.. కనీసం ఉనికి కూడా చాటుకోలేకపోయింది. అలాంటి పార్టీతో పొత్తు కోసం వెంపర్లాడడం ఎవరికైనా ఆశ్చర్యం కల్గించే అంశమే. బీజేపీ చేతులు కలిపితే వచ్చి చేరే అదనపు ఓటుబ్యాంకు సంగతి ఎలా ఉన్నా.. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి కూటమి నైతిక స్థైర్యం పెరుగుతుంది. ఇది తప్ప మరో బలమైన కారణమేదీ కనిపించడం లేదు.అయినప్పటికీ బీజేపీతో పొత్తు కోసం తెలుగుదేశం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. ఇంటా, బయటా ఒత్తిడి పెంచుతోంది. తెలంగాణలోనూ తెలుగుదేశం ఓటుబ్యాంకు బీజేపీకి అదనపు బలంగా మారుతుంది అంటూ ఖమ్మంలో భారీ సభ నిర్వహించి మరీ సంకేతాలు పంపించింది. అయితే తెలంగాణ బీజేపీ మాత్రం టీడీపీతో చెలిమి లాభం కంటే ఎక్కువ నష్టమే కల్గిస్తుందని అధిష్టానం పెద్దలకు చెప్పి, ఒంటరిగానే పోటీ చేయడానికి సిద్ధమైంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తు కోరుకుంటున్న కొందరు బీజేపీ నేతలు తమ అధిష్టానంపై ఒత్తిడి పెంచుతూ వచ్చారు. టీడీపీతో పొత్తు లేకపోతే 2019 ఫలితాలే పునరావృతమవుతాయని, పొత్తుంటే గౌరవప్రదమైన సీట్లు పొందవచ్చని ప్రతిపాదించారు. వీలున్న ప్రతిసారీ ఈ విషయాన్ని చెబుతూనే ఉన్నారు. అయినా సరే, అధిష్టానంలో కదలిక లేదు.ఒకప్పుడు వైఎస్సార్సీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్న కన్నా లక్ష్మీనారాయణను ఆపి, తమ పార్టీలోకి తీసుకొచ్చి, రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టిన కాషాయదళం.. అదే వ్యక్తి ఇప్పుడు పార్టీని వీడి వెళ్తానని హెచ్చరించినా సరే పట్టించుకోలేదు. కనీసం ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. కన్నా వెళ్తూ.. వెళ్తూ తనతో పాటు తన వర్గం నేతలనూ తీసుకెళ్లారు. సరిగ్గా అదే రోజు ఓ పాతిక మంది ఏపీ బీజేపీ నేతలు ఢిల్లీకి చేరుకుని రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మురళీధరన్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వ్యవహారశైలి కారణంగానే నేతలు పార్టీ వీడి వెళ్తున్నారని, ఆయనుంటే పార్టీ మరింత నష్టపోతుందని తేల్చి చెప్పారు. అయితే ఈ నేతల బృందం రాక గురించి, వారు చెప్పబోయే అంశాల గురించి ముందే తెలిసినట్టుగా మురళీధరన్ వ్యవహరించడంతో వారంతా షాక్ అయ్యారు. భేటీ పూర్తయ్యాక బయటికొస్తూ నేతలు తమలో తాము మాట్లాడుకుంటూ "ప్చ్.. వచ్చి ఉపయోగం లేకపోయింది. మనం చెప్పేది వినే ధోరణిలో ఆయన లేడు" అని పెదవి విరిచారు. ఇంతమంది ఎందుకొచ్చారంటూ మందలించినట్టుగానూ వారు మీడియాతో చెప్పారు. అంత దూరం ప్రయాసపడి మరీ వచ్చి కలిస్తే.. నిలబడే మాట్లాడారని, కొన్ని నిమిషాలే కేటాయించారని మరికొందరు నేతలు అసంతృప్తి వెలిబుచ్చారు. పొరుగునే ఉన్న తెలంగాణలో కమలదళం పోరాటపటిమను ప్రదర్శిస్తూ దూసుకెళ్తుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ నాయకత్వం ఏ సమస్యపైనా పోరాటం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే రాష్ట్ర నాయకత్వంలో కొందరు వైఎస్సార్సీపీకి అనుకూలంగా, కోవర్టులుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. కానీ అధిష్టానం మాత్రం వచ్చిన నేతలందరూ తెలుగుదేశంతో పొత్తు కోరుకునే వర్గానికి చెందినవారని, వారు చెప్పే విషయాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నట్టు తెలిసింది. సోము వీర్రాజును తొలగించాలా.. కొనసాగించాలా అన్నది అధిష్టానం నిర్ణయమని, క్రమశిక్షణ కల్గిన పార్టీ కార్యకర్తల బాధ్యత అధిష్టానం ఆదేశాలను అమలు చేయడమేనని మురళీధరన్ తేల్చి చెప్పినట్టు సమాచారం. మొత్తంగా అధిష్టానం తీరుతో బీజేపీలో టీడీపీ పొత్తు కోరుకుంటున్న వర్గానికి క్లారిటీ వచ్చినట్టే కనిపిస్తోంది.

## ఇక తాటాకు బుట్టల్లో లడ్డూ ప్రసాదాలు

**సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్న టిటిడి**

**పర్యావరణ పరిరక్షణకు మేలు చేస్తుందన్న భావన**

తిరుమల,ఫిబ్రవరి25 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేసే విధంగా మరో నిర్ణయంతీసుకుంది టీటీడీ. తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా టీటీడీ మరో ప్రయత్నం చేస్తోంది. శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని ఇక నుంచి తాటాకు బుట్టల్లో భక్తులకు అందించే ఆలోచనలో ఉంది. తిరుమలలో వాతావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేలా తాటాకు బుట్టలను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. తాటాకు బుట్టల వినియోగాన్ని అమల్లోకి తెస్తే.. ఓ వైపు ప్లాస్టిక్ వినియోగం తగ్గి.. పర్యవరణ పరిరక్షణ జరగడమే కాదు.. మరోవైపు హస్తకళలను ప్రోత్సహించినట్లు ఉంటుందని భావిస్తోంది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయవేత్త విజయరామ్ తాటాకులతో వివిధ సైజ్ ల్లో తయారు చేసిన బుట్టలను టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఈ తాటాకు బుట్టలను త్వరలోనే లడ్డు కౌంటర్లల్లో వాడకంలోకి తీసుకురానున్నామని ఇవో ధర్మారెడ్డి చెప్పారు. ఈ సమయంలో తాటాకు బుట్టల వినియోగం సాధ్యాలతోపాటు లడ్డు ప్రసాదాలను తీసుకెళ్లే భక్తులకు తాటాకు బుట్టలు ఎంతమేర ఉపయోగకరంగా ఉంటాయన్న దానిపై టీటీడీ అధ్యయనం చేయనుంది. ఇప్పటికే తిరుమల క్షేత్రంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లతో పాటు ప్లాస్టిక్ కవర్లలో పూజా సామగ్రిని ఆలయాల్లోకి అనుమతించడం లేదు. అంతేకాదు ఆలయానికి అనుబంధంగా ఉండే షాపుల్లో ఎ÷-లాస్టిక్ కవర్లు, ఎ÷-లాస్టిక్ వాటర్ బాటిళ్ల అమ్మకాలను ఇప్పటికే నిషేధించడమే కాదు.. ఆలయాల్లో ప్రసాదాల పంపిణీలోనూ చిన్నచిన్న ఎ÷-లాస్టిక్ వినియోగాన్ని బ్యాన్ చేశారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ బదులు గాజు సీసాలను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంప్రదాయ వృత్తుల ప్రోత్సాహంతో పాటు ప్రకృతి పరిరక్షణ కోసం టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రకృతి వ్యవసాయవేత్త విజయరామ్ సహకారంతో తాటాకు బుట్టలను తిరుమల లడ్డూ విక్రయ కేంద్రంలో భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు పలు రకాల బుట్టలను ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు. ఈ నిర్ణయంతో తాటి చెట్లను పెంచే వారికి ఆదాయం, తాటాకు బుట్టలను తయారు చేసే వారికి చేయూత అందుతుందని టీటీడీ భావిస్తోంది. ఈ సమయంలో తాటాకు బుట్టల వినియోగం సాధ్యాలతో పాటు లడ్డు ప్రసాదాలను తీసుకెళ్లే భక్తులకు తాటాకు బుట్టలు ఎంతమేర ఉపయోగకరంగా ఉంటాయన్న దానిపై టీటీడీ అధ్యయనం చేయనుంది.

## బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

బ్రాహ్మణ కొట్కూరు మాదిగ వృద్ధి కొరకు, ఎస్సీ వర్గీల వర్గీకరణ కొరకు, అమరావతి ముట్టడిలో భాగంగా మందకృష్ణ, మాదిగ పిలుపుమేరకు, కర్నూలు నుండి అమరావతి పాదయాత్ర సందర్భంగా, రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీతో, పాటు ఇతర నాయకులు పాదయాత్రగా బయలుదేరుతూ బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో మాదిగలు స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ చేశారు. ఇందు సందర్భంగా బెనర్జి మాట్లాడుతూ మాదిగల అభివృద్ధికి పాటుపడాలని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ర్యాలీలో (ఎమ్మార్పీఎస్) నాయకులు జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, ప్రేమ్ రాజ్ ,నాగరాజు, శ్రీనివాసులు మరియు బ్రాహ్మణ కొట్కూర్ గ్రామం (ఎమ్మార్పీఎస్) కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఏబీఎం చర్చి నుండి ప్రారంభమై అమరావతి వరకు కొనసాగుతుంది. ఎమ్మార్పీఎస్ వర్ధిల్లాలని నినాదాలతో హోరెత్తించారు.

### శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళాల పాత్ర కీలకం

చిత్తూరుఆర్మడ్ రిజర్వ్ పోలీసు ఏ.ఆర్. మొబిలైజేషన్ లో భాగంగా జరుగుతున్న ఫైరింగ్ ప్రాక్టీసు రేంజ్ ను చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి అకస్మికంగా తనిఖీ చేసారు. గంగాధర్ నెల్లూరు లోని గల చిత్తూరు పోలీస్ ఫైరింగ్ రేంజ్ లో ఏ.ఆర్. సిబ్బంది, అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహిస్తున్నారు. అక్కడికి చేరుకున్న ఎస్పీ స్వయంగా పలు రకాల తుపాకులతో నీల్ పోజిషన్, స్టాండింగ్ పొజిషన్ మరియు లయింగ్ పొజిషన్ లో అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భముగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమని అన్నారు. అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని తెలిపారు. ఫైరింగ్ లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్ నందు ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్ నందు క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని కావున ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ ప్రాక్టీసెస్ ను జాగ్రత్తగా చేయవలెనని ఆదేశించారు. అనంతరం ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ ప్రక్రియ గూర్చి ఎస్పీ పలు సూచనలు తెలియజేశారు. ప్రతి ఒక్క బుల్లెట్టు టార్గెట్ (లక్ష్యం) వైపే బుల్ పడే విధంగా తర్ఫీదు పొందాలని సూచించారు, అదేవిధంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ యొక్క ఉన్నతి కోసం ముందడుగు వేయాలని తెలిపారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీసు నందు ఏ.ఆర్. అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు, ఎస్.బి. డి.ఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏ.ఆర్. డి.ఎస్పీ మురళి, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగి రెడ్డి, ఆర్.ఐ. అడ్మిన్ నీలకంటేశ్వర రెడ్డి, గంగాధర నెల్లూరు ఎస్.ఐ. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


## శిశువు మృతి?బంధువుల అందోళన

కృష్ణాజిల్లా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు పీ.హెచ్.సీ లో డాక్టర్ కళ్యాణి నిర్లక్ష్యం వలనే తమ బిడ్డ మృతి చెందాడని భాదితులు నిరసన చేపట్టారు. కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన రూపశ్రీ ప్రసవ నొప్పులతో నిన్న మధ్యాహ్నం జి.కొండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. రాత్రి 11గంటలకు ప్రసవం అయింది. శిశువుకు చలనం లేకపోవడంతో విజయవాడ తీసుకెళ్ళమని ఆసుపత్రి సిబ్బందిఅంబులెన్సు పిలిపించారు. విజయవాడ వైద్యులుబిడ్డ మృతి చెందినట్లు దృవీకరించారు. దాంతో, డాక్టర్ కళ్యాణి పెళ్ళికి వెళ్ళి,స్టాఫ్ నర్స్ తో డెలివరీ చేయించడం వలనే ఇలా జరిగిందంటూ బందువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ చనిపోయిన బాబును చేతిలో పట్టుకుని ఆసుపత్రి ముందు నిరసన తెలిసారు. భాదితులు డయల్ 100కి ఫోన్ చేసారు. ఎసై ధర్మరాజు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు తీసుకున్నారు.

## బాబు, విజయసాయిరెడ్డి ఫోటోలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్

నెల్లూరు, ఫిబ్రవరి 25,అవును వారిద్దరూ బద్ధ శత్రవులు. ఒకరినొకరు వ్యక్తిగత విమర్శలు కూడా చేసుకునే వారు. ట్విట్టర్ లోనూ, మైకు ఎదుట ఎక్కడ పడితే అక్కడ విమర్శలు చేసుకోవడమే ఇద్దరికీ పని. ఒకరు టీడీపీ అధినేత చంద్రబాబు కాగా, మరొకరు వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి. జగన్ ను ఎంతగా ద్వేషిస్తారో టీడీపీ నేతలు విజయసాయిరెడ్డిని కూడా అదేస్థాయిలో దారుణంగా ట్రోల్ చేస్తారు. ఇది ఇప్పటి నుంచి కాదు 2014 ఎన్నికల నాటి నుంచి జరగుతున్నదే. కొత్త విషయమేమీ కాదు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇది అందరికీ తెలిసిన విషయమే. ఏ 2 అంటూ... విజయసాయిరెడ్డిని చంద్రబాబు ఏ2 అని తరచూ విమర్శలు చేస్తుంటారు. విశాఖపట్నం ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు కూడా ఆయన భూకుంభకోణాలకు చేశారని సాయిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేశారు. ఇక చంద్రబాబుతో పాటు టీడీపీ నేతలు అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్న లాంటి నేతలయితే విజయసాయిరెడ్డిపై ఒంటికాలు మీద లేస్తారు. ఇక లోకేష్ సరేసరి. వైసీపీలో నెంబర్ టూగా ఉన్న విజయసాయిరెడ్డిని విమర్శిస్తే జగన్ ను విమర్శించినట్లే భావిస్తారు. అందుకే విజయసాయిరెడ్డిని టీడీపీ నేతలు ఎప్పుడూ టార్గెట్ చేస్తారు. అదే స్థాయిలో విజయసాయిరెడ్డితో పాటు వైసీపీ నేతలు కూడా చంద్రబాబును, లోకేష్ ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుంటారు. విజయసాయిరెడ్డి కూడా చంద్రబాబును అదేస్థాయిలో విమర్శిస్తారు. లోకేష్ ను కూడా వ్యక్తిగతంగా విమర్శిస్తారు. చంద్రబాబుపై వ్యక్తిగత ఆరోపణలు కూడా సాయిరెడ్డి తరచూ చేస్తుంటారు. కానీ కొద్దిరోజుల క్రితం వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు కలసి కూర్చుని మాట్లాడుకోవడంపై రెండు పార్టీల్లోని కార్యకర్తలు తీవ్ర స్థాయిలో అభ్యంతరం చెబుతున్నారు. వైసీపీ నేతగా ఉన్న విజయసాయిరెడ్డి చంద్రబాబుతో మాట్లాడమేంటి? ఆయనతో కలసి మీడియాతో మాట్లాడటమేంటి? ఆయనను కారు వద్ద వరకూ వచ్చి సాగనంపడమేంటి? అని వైసీపీ సోషల్ మీడియాలో సాయిరెడ్డిని ప్రశ్నిస్తున్నారు. సాయిరెడ్డి ఆరోజు వ్యవహరించిన తీరుపై అభ్యంతరం తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. అదే స్థాయిలో టీడీపీ అభిమానులు సయితం చంద్రబాబును తప్పుపడుతున్నారు. నెంబర్ 2 అని విమర్శించి ఆయనతో మంతనాలు ఏంటంటూ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.తారకరత్న భౌతికకాయం వద్ద... నిజానికి ఒక విషాదఘటనలో వారిద్దరూ కలుసుకున్నారు. తారకరత్న విజయసాయిరెడ్డి మరదలి కూతురు భర్త. అందుకోసమే తారకరత్న విషయంలో విజయసాయిరెడ్డి అంత చొరవ తీసుకున్నారు. అలాగే చంద్రబాబు కూడా తారకరత్న తన భార్య తరుపున బంధువు. అల్లుడి వరస అవుతాడు. అలాంటి చోట ఇద్దరూ కలసి కూర్చుని కుటుంబ విషయాలపై మాట్లాడుకుంటే తప్పు పట్టడమేంటి? అని కొందరు ప్రశ్నిస్తున్నా రెండు పార్టీల అభిమానులు మాత్రం వీరిద్దరు కలసి కూర్చుని మాట్లాడుకోవడం జీర్ణించుకోలేకపోతున్నారు. నెగిటివ్ గా పోస్టులు పెడుతున్నారు. విజయసాయిరెడ్డికి తెలియకుండానే అనుబంధ సంఘాలను భర్తీ చేయడం కూడా ఆయనపై హైకమాండ్ ఆగ్రహంగా ఉందంటూ మరికొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద ఈ ఫొటో విషాద సమయంలో బయటకు వచ్చినా సోషల్ మీడియాలో రగడ మాత్రం ఇప్పట్లో ఆగేలా లేదు.

## అధికారపక్షమే గంటా రాజకీయ లక్ష్యం



**టిడిపితో అంటీముట్టనట్లుగా సాగుతున్న వ్యవహారం**

**భవిష్యత రాజకీయంపై తొలగని అయోమయం**

విశాఖపట్నం,ఫిబ్రవరి25 : ఏపిలో తిరిగి అధికారమే లక్ష్యంగా టిడిపి యుద్ధం తరహాలో అధికార వైసిపిపై పోరాడుతోంది. వివిధ సమస్యలే కావచ్చు..లేదా నిర్ణయాలు కావచ్చు ప్రభుత్వం తీరుపై మండి పడుతోంది. ఎక్కడికక్కడ నేతలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడుతున్నారు. వైసిపి పాలనను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఒకప్పుడు అధికారం వెలగబెట్టి, మంత్రిపదవిని అనుభవించిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాత్రం అంటీముట్టనట్లుగా ఉన్నారు. ఆయన వైసిపిలోకి వెళతారని ఒకసారి, జనసేనలోకి వెళతారని మరోసారి, బిజెపిలోకి కూడా వెళతారని ప్రచారం సాగింది. గతంలోనే ఆయన వైసిపిలోని వెళ్లాలని ప్లాన్ వేసుకున్నా ఎందుకనో బెడిసికొట్టింది. దీంతో అటు అధికార పార్టీలోకి వెళ్లేక..ఇక టిడిపిలో ఇమడలేక రాజకీయ దోబూచులాడుతున్నారు. పార్టీలోనే ఉంటానంటున్నా.. హైకమాండ్ పిలిస్తే మాత్రం పలకరు. ఉనికి కోసమే అనుకుంటే.. వ్యూహాలను తెరపైకి తెస్తారు. మూడున్నరేళ్లుగా ఇదే ఆయన అనుసరిస్తున్నారు. దాదాపుగా వైసిపిలో చేరుతారనుకున్న సమయంలో ఆనాటి మంత్రి అవంతి శ్రీనివాస్ అడ్డుపుల్ల వేశారని ప్రచారం జరిగింది. మొత్తంగా అధికారం ఉంటే తప్ప నిలబడని రాజకీయ వ్యవహారాన్ని గంటా అలవర్చుకున్నారు. వైసిపిలో చేరివుంటే ఏదో ఒక పదవిని తగించుకుని చురుకుగా తిరిగేవారేమో అని రాజకీయాల్లో చర్చ సాగుతోంది. సుదీర్ఘ అనుభవం ఉన్న కాపు నేతగా గుర్తింపు ఉన్నా..రాజకీయంగా మాత్రం అధికారపక్షంలో ఉండేందుకు ఇష్టపడతారు. అలాగే అధికారంలో ఉన్నా లేకపోయినా ఎప్పుడూ వార్తల్లో నిలిచేందుకు తాపత్రయ పడతారు. రాజకీయాలను తన చుట్టూ తిప్పుకోవాలనే తాపత్రయం ఆయనలో కనిపిస్తుంది. ప్రస్తుతం విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన రాజకీయ స్తబ్ధత పాటిస్తున్నారు. పార్టీకి, ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండటం లేదు. పార్టీకోసం బహిరంగ వేదికలపైకి వచ్చిన సందర్భం లేదు. వైసిపిలోకి వెళ్లలేక పోయినా టిడిపిలో అయినా రాజకీయంగా చురుకుగా ఉండడం లేదు. అలాగే చంద్రబాబుతో సఖ్యత కొనసాగించడం లేదు. దీంతో ఆయన ఎటువైపో తేల్చుకోవడం ప్రజలకు కూడా కొంచెం కష్టంగానే ఉంది. ఈ క్రమంలో చంద్రబాబుతో దూరం పెరిగిందనే భావన ఉంది. అది నిజమే అన్నట్టు ఆయన వైఖరి ఉంటోంది. ఉత్తరాంధ్రలో పార్టీ పటిష్టత, భవిష్యత్ ప్రణాళికల కోసం చంద్రబాబు ఎమ్మెల్యేలతో ముఖాముఖీ సమావేశం అవుతున్నా..గంటా ఎక్కడా కానరావడం లేదు. దీంతో అసలు ఏం జరుగుతుందనే ఉత్సుకత రాజకీయ వర్గాల్లో రేకెత్తింది. మరోవైపు అధినేతతో కనీసం ఫోన్‌లో అయినా చర్చించేందుకు రావడం లేదు. ఉత్తరాంధ్రలో కూడా టిడిపి గట్టిగా పోరాడుతున్నా ఆయన మాత్రం అంటీ ముట్టనట్లుగా ఉన్నారు. చాలాకాలంగా గంటా శ్రీనివాస్ పక్కపార్టీల వైపు చూస్తున్నారనే ప్రచారం నలుగుతోంది. మొదట్లో వైసీపీలో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేసినా వర్కవుట్ కాలేదు. మాజీమంత్రి అవంతి, ఎంపీ విజయసాయిరెడ్డి వంటి వారు బహిరంగ వేదికలపైనే వ్యతిరేకించారు. ఆ తర్వాత టీడీపీలోనే కొనసాగాలని నిర్ణయించుకున్న గంటా.. మధ్యలో కాస్త యాక్టివ్ రోల్ తీసుకునేందుకు ప్రయత్నించారు. అయినా అధినేతతో సమావేశానికి గంటా దుమ్మాకొట్టడం వెనక అసలు కారణాలపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాకినాడ గొల్లప్రోలు మండలం చేబ్రోలు హైవేపై తాడిపర్తి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతం లో చేబ్రోలు గ్రామం నుండి హైవే మీదుగా దర్శనానికి వెళ్తున్న భక్తులపై గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందారు. ఇంకొక రు తీవ్ర గాయాలయ్యారు. బాధితులు చేబ్రోలు గ్రామానికి చెందిన వారు గా గొల్లప్రోలు పోలీసులు గుర్తించారు. కత్తిపూడి నుండి సుమారు మూడు నలభై ప్రాంతంలో కాకినాడ వెళుతున్న గుర్తుతెలియని లారీ ఆడవారిపై అత్యంత వేగంగా దూసుకుంటూ ఆగకుండా వెళ్ళిపోయింది.

## శ్రీవారి సేవలో టిడిపి మాజీమంత్రి బోండా ఉమా

తిరుమల వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో దొరికిన దొంగలకు జైలు శిక్ష తప్పదని టిడిపి మాజీమంత్రి బోండా ఉమా ఆరోపించారు.. శనివారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో బొండా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారా లోకేష్ మొదలు పెట్టిన యువగళం పాదయాత్రకు వైసీపి ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కలిస్తున్నారని, పాదయాత్రలో లోకేష్ ను మాట్లాడకుండా మైకులు,స్టూల్ లు లాగేసుకుంటున్నారని మండిపడ్డారు.. పాదయాత్రకు వచ్చిన వారిపై కేసులు పెట్టడం, ఆటోలను సీజ్ చేయడం చేస్తున్నారని, ప్రతిపక్షాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయడంతో పాటుగా గొంతును నొక్కె ప్రయత్నం జరుగుతుందన్నారు.. రాష్ట్రంలో రాక్షస పరిపాలన వికృతంగా కొనసాగుతుందని చెప్పిన ఆయన, ఇంటికి వెళ్ళి పోతున్నాంమని ప్రశాంత్ కిషోర్ ఇచ్చిన సర్వేలు, సొంతంగా చేసుకున్న సర్వేలతో జగన్ కు భయం పట్టుకుందన్నారు.. ప్రతిపక్షాల గొంతును నొక్కేందుకు పార్టి కార్యాలయాలపై దాడులు, కారులు తగల పెట్టడం వంటివి చేస్తున్నారని విమర్శించారు.. అనపర్తిలో జెడ్ ప్లస్ కేటగిరి ఉన్న చంద్రబాబును దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పాటు లైట్లు తీసి నడిపించారన్నారు.. పాదయాత్ర మొదలు పెట్టిన తర్వాత లోకేష్ పై ఇరవై కేసులు పెట్టారని, ఏం తప్పు చేసారని కేసులు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు.. రాజ్యాంగం,చట్టం ఉల్లంఘన చేస్తున్న అధికారులకు కనువిప్పు కలగాలని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు అధికారులు కాలరాస్తున్నారని చెప్పిన ఆయన, తప్పు చేసిన ప్రతి అధికారి సర్వీస్ రికార్డుల్లో శిక్షింపబడిరాడని ఆయన చెప్పారు.. పాదయాత్రకు అద్భుతంగా ప్రజల నుండి స్పందన వస్తొందని, లోకేష్ పాదయాత్రకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని, లోకేష్ కు దుష్టశక్తుల నుండి రక్షణ కల్పించాలని, లక్ష్యం పూర్తి చేసే విధంగా శక్తిని ప్రసాదించాలని స్వామి వారిని ప్రార్ధించినట్లు తెలియజేశారు.. అతిత్వరలోనే ఈ దుర్మార్గపు పరిపాలనకు ప్రజలు చరమగీతం పలుకబోతున్నారని, అవినాష్ రెడ్డి దొరికి పోయినా దొంగ అని, అవినాష్ రెడ్డి వెనుక ఇంకా అసలైన శక్తులు ఉన్నాయని, అందులో అవినాష్ రెడ్డి తండ్రి కూడా కేసులో ఉన్నారని, మరికొందరు త్వరలోనే బయట పడతారన్నారు.. ఇక గూగుల్ పే కోర్టు వాస్తవాలను బయట పెట్టిందని, కొన్న రకాలుగా వివేకానంద రెడ్డి హత్య చేసి కొన్ని రోజులు మభ్య పెట్టగలిగారని, టెక్నాలజీ, సిబిఐ మొత్తం విషయాలు బయట పెడుతుందన్నారు.. దొరికిన దొంగకు జైల్ కు వెళ్ళక తప్పదని ఆయన హెచ్చరించారు.. వివేకానంద హత్య కేసులో ఆధారాలను తప్పు దోవ పట్టించింది అవినాష్ రెడ్డే అని, తెల్లవారుజామున మూడు గంటల నుండి భారతీ ఓఎస్డి కృష్ణమోహన్ తో, జగన్ తో మాట్లాడింది అవినాష్ రెడ్డే అని ఆయన తెలిపారు.. వివేకానంద రెడ్డి సునిత చేస్తున్న పోరాటం వీరి మెడకు చుట్టుకుందని, ఇంకా ఇద్దరూ వ్యక్తులను విచారణకు పిలుస్తారని, వివేకానంద హత్యలో నిందుతులు, పాత్రదారులు తప్పించుకోలేరని ఆయన తెలియజేశారు..

### శ్రీవారి సేవలో తెలంగాణ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

తిరుమల తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్యే కోరుకంటి .చందర్ పటేల్ దర్శించుకున్నారు.. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో చందర్ పటేల్ స్వామి వారి సేవలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు.. దర్శనానంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న కేసీఆర్ కారణ జన్ముడని ఆయన కొనియాడారు.. దేశంలో ఉన్న పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్రంలో అందే సంక్షేమ పథకాలు అందించాలని సంకల్పంతో కేసీఆర్ బిఆర్ఎస్ పార్టి స్థాపించడం జరిగిందన్నారు.. బిఆర్ఎస్ పార్టీకి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒకరికి దేవదేవుడి ఆశీస్సులు ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.. నాల్గున్నర ఏళ్ళ కాలంలో అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు.. రాబోవు కాలంలో ప్రజల దీవెనలతో కేసిఆర్ విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు..

# హత్య కేసులో ఆరు మంది అరెస్టు

## మాట వినడం లేదని హత్య

బద్వేలు తన మాట వినడం లేదని ప్రొద్దుటూరు పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన చిన్న మాయల రామాంజనేయులు 36 అనే యువకుడ్ని హత్య చేసినటు మందిని బద్వేలు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు శనివారం బద్వేలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేలు రూరల్ సీఐ హనుమంతు నాయక్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు నాలుగు రోజుల క్రితం వీరు రామాంజనేయులు హత్య చేశారు ప్రొద్దుటూరు పట్టణం సంజీవ నగర్ చెందిన రామాంజనేయులు ను ఈనెల 16వ తేదీ గోపవరం మండలం సోమేశుల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో జరిగే చేపల వేటకు పిలుచుకుపోయారు వీరంతా ఒక క్యాంపులో ఉండేవారు క్యాంపులో నాగేశ్వరరావు పెద్దగా ఉండేవాడు ఇతని స్వగ్రామం ప్రకాశం జిల్లా కొత్తపేటనాగేశ్వరరావు చెప్పిన మాట రామాంజనేయులు వినేవాడు కాదు ఇలాగే ఉంటే క్యాంపులో ఎవరు కూడా మాట వినరని ఇతరులు చెప్పడం జరిగింది దీంతో నాగేశ్వరరావు రామాంజనేయులు ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు అనుకున్న ప్రకారం నాగేశ్వరరావు సుధాకర్లు రామాంజనేయులను గొంతుకు తాడు బిగించి చంపేశారు రామాంజనేయులు ను క్యాంపు లో ఉన్న శివ ముస్తఫా చూశారు వారిని అక్కడి నుండి వెళ్లిపొమ్మని నాగేశ్వరరావు చెప్పడం జరిగింది క్యాంపులో వారికి ఈ విషయం తెలియకుండా దాచిపెట్టారు ఆ తరువాత రామాంజనేయులు మృతదేహాన్ని గోపవరం మండలంసూరేపల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమేశుల జలాశయం మునక ప్రాంతం అయినగాజులపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న ఒక పాడుబడిన బావిలో వేశారు రామాంజనేయులకు ఈత రానందున బావిలో పడి మృతి చెంది ఉంటాడని ఒక కథనం అల్లారు ఇదే విషయాన్ని రామాంజనేయులు భార్య దుర్గకు శివరాజు చెప్పడం జరిగింది తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని దుర్గ బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారుదీంతో పోలీసులు విచారణ చేపట్టారు నెల్లూరు జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన సింహాద్రి తోపాటు మరో ఆరు మంది ముద్దాయిలు పట్టుకువచ్చి పోలీసులు విచారణ చేశారు దీంతో అసలు విషయాలు వెలుగు చూశాయి హత్య కేసులో నాగేశ్వరరావు తోపాటు నెల్లూరు జిల్లా సోమేశుల మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన సుధాకర్ ఇదే జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన ఇదే జిల్లా సోమేశుల గ్రామంలో ఉంటున్న విశాఖపట్నం జిల్లా అశోక్ సోమేశుల గ్రామానికి చెందిన మల్లికార్జున ఇదే గ్రామానికి చెందిన బాబ్లిను పోలీసులు అరెస్ట్ చేశారు విలేకరుల సమావేశంలో బద్వేల్ రూరల్ ఎస్సై చంద్రశేఖర్ గ్రామీణ పోలీసులు పాల్గొన్నారు హత్య కేసును చేదించిన డి.ఎస్.పి వంశీధర్ గౌడ్ రూరల్ సీఐ హనుమంతు నాయక్ పోలీసులును కడప జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు



# వయోపరిమితి పెంచడం కాదు, ఉద్యోగాలు ఇవ్వండి




## --- సీఎం జగన్ కు టిడిపి విన్నపం

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 25. సోమవారము.ఎమ్మిగనూరు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి యస్.సి, యస్.టి.బి.సి.లకు 5 ఏళ్ల వయో పరిమితి సడలించిన తరహాలో .. ఈ డబ్ల్యు ఎస్ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో గరిష్ఠ వయో పరిమితి 34 సంవత్సరాలను 5 ఏళ్లు సడలిస్తూ... సబార్డినెట్స్ సర్వీస్ రూల్స్ ను సవరిస్తూ... ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని కానీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని టిడిపి నాయకులు తెలిపారు. మాజీ కేంద్రమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి× గారి ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయం నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో టిడిపి నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తుండడంతో... ప్రజలను, నిరుద్యోగ యువతను మభ్య పెట్టడానికే కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన వెంటనే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన జగన్ నేడు జాబ్ లెస్ క్యాలెండర్ ను విడుదల చేసి నిరుద్యోగ యువతను మోసగించడం వాస్తవం కాదా! అని ప్రశ్నించారు?. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు హాయంలోనే యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. యువతకు వయసు సడలింపు కాదు, ఉద్యోగాలు భర్తీ చేసి ఆదుకోవాలని కోరారు. నిరుద్యోగ యువకులకు జాబు రావాలంటే బాబు రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో "భూమి రెడ్డి" ని గెలిపించండి మార్చి 13న జరుగు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో... టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాలరెడ్డిని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టిడిపి నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, అడ్వకేట్ కె.టి.మల్లిఖార్జున, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు కె.యం.డి.అబ్దుల్ జబ్బార్ తదితరులు ఉన్నారు.

# వలసల నివారణలో ప్రభుత్వ వైఫల్యం---

## --- బొజ్జా దశరథరామిరెడ్డి.

నంద్యాల :-కర్నూలు పశ్చిమ ప్రాంతం నుండి వలసలు ఆపడానికి కావలసిన చర్యలు చేపడతాం అని ప్రభుత్వం పదేపదే చేసే ప్రకటనలకు, ఆచరణకు పొంతనలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామి రెడ్డి విమర్శించారు. శనివారం నాడు రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. ఈ ప్రాంతం నుండి వలసల నివారణకు తలాపుననే ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఆధారంగా లక్ష యాభై ఒక్క వేయి ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో ఎల్ ఎల్ సి నిర్మాణం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. కానీ తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు గత పది సంవత్సరాలుగా యాభై వేల ఎకరాలకు కూడా నీరందించని విషయాన్ని ఆయన వివరించారు. ప్రాజెక్టుకు కేటాయించిన నీటి కంటే అదనంగా తుంగభద్ర నదిలో ప్రవహిస్తున్న ఈ నీటిని సద్వినియోగం చేసుకోవడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై పాలకుల నిర్లక్ష్యం ఈ ప్రాంతానికి శాపంగా మారిందని బొజ్జా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంవత్సరం సుమారు 600 టి ఎం సీ ల తుంగభద్ర జలాలు శ్రీశైలం రిజర్వాయర్ చేరినప్పటికి, ఎల్ ఎల్ సి ఆయకట్టులో సగానికి కూడా సాగునీరు అందించలేకపోయారని తెలిపారు. ఎల్ ఎల్ సి ఆయకట్టుకు నీరందించకుండా, ఈ ప్రాజెక్టుకు తుంగభద్ర డ్యాం లో హక్కుగా ఉన్న నీటి నుండి 2 టి ఎం సీ లు తుంగభద్ర ఎగువ కాలువకు మళ్ళింపుకు జలవనురుల శాఖ ప్రతిపాదనలు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వై ఎన్ రెడ్డి, ఏర్వ రామచంద్రా రెడ్డి, కోశాధికారి చెరుకూరి వెంకటేశ్వర నాయడు, సభ్యులు పట్నం రాముడు, కొమ్మా శ్రీహరి, రామిరెడ్డి, రాఘవేంద్ర గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రజా సంబంధాల కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.



# 'ప్రశ్నించే గొంతులను గెలిపించండి.....డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ



ఎమ్మిగనూరు. ఎమ్మిగనూరు పట్టణంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ప్రశ్నించే గోంతులను శాసనమండలికి పంపించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడుతూ నాడు శాసనమండలినే రద్దు చేయాలన్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు నేడు ఏ మోహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచే శాసనమండలిలో పిడిఎఫ్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నీతి నిజాయితీ నిరాడంబరత కలిగిన వారు శాసనమండలికి ఎన్నికై ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న నిరుద్యోగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, రాయలసీమ ప్రాంతాల్లో కరువువును శాశ్వతంగా దూరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి పట్టభద్రుల ఆలోచించి నిజాయితీగా ఓటు వేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోటీ చేస్తున్న పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి గారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, రాము, నితీష్ తదితరులు పాల్గొన్నారు

# రాజమౌళి ఇండియన్ స్పీల్ బర్గ్ : రామ్ చరణ్




రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ ఆర్ ఆర్' ప్రపంచ వ్యాప్తంగా ఇండియన్ సినిమాకు ఎనలేని కీర్తిని తెచ్చి పెడుతోంది. టాలీవుడ్ టాప్ స్టార్స్ రామ్ చరణ్ ఎన్టీఆర్ లతో రూపొందించిన ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలు సృష్టించిన విషయం తెసిందే. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టిన ఈ మూవీ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ మొదలైన దగ్గరి నుంచి హాలీవుడ్ ప్రముఖుల్ని ఆకట్టుకుంటూ వారి ప్రశంసల్ని సొంతం చేసుకుంటోంది. ప్రఖ్యాత గోల్డెన్ గ్లోబ్ పురస్కారాన్ని దక్కించుకుని ఆస్కార్ కు అడుగు దూరంలో వుంది.ఇదిలా వుంటే ఈ సినిమాతో రామ్ చరణ్ ఎన్టీఆర్ లకు వరల్డ్ వైడ్ గా ఊహించని క్రేజ్ ఏర్పడింది.అంతే కాకుండా రామ్ చరణ్ గురించి ప్రఖ్యాత హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కెమెరూన్ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం పలువురిని ఆకట్టుకుంటోంది. త్వరలో ఆస్కార్ అవార్డుల వేడుక జరగనున్న నేపథ్యంలో ఆస్కార్ కమిటీ ఇటీవల చిత్ర బృందానికి ఆహ్వానాలు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ అమెరికా వెళ్లిపోయారు.ప్రస్తుతం అక్కడ చరణ్ సందడి చేస్తున్నారు. మోస్ట్ పాపులర్ షో 'గుడ్ మార్నింగ్ అమెరికా 3' ఇంటర్వ్యూలో చరణ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. 'నాటు నాటు' సాంగ్ బెస్ట్ ఒరిజినల్ గా ఆస్కార్ కు నామినేట్ అయిన నేపత్యంలో 'గుడ్ మార్నింగ్ అమెరికా 3' టీమ్ రామ్ చరణ్ ని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. ముగ్గురు యాంకర్లు చరణ్ ని ఇంటర్వ్యూ చేస్తూ పు ఆసక్తికర ప్రశ్నలు వేశారు. చరణ్ కూడా అంతే ఆసక్తిగా సమాధానలు చెప్పడం విశేషం..చరణ్ ఇంటర్వ్యూ జరుగుతున్న స్టూడియో ముందు భారతీయ అభిమానులు ఘన స్వాగతం పలుకుతూ హంగామా చేయడం విశేషం. సినిమా ఈ స్థాయిలో వైరల్ కావడానికి గల కారణం ఏంటని అడిగితే ..గ్రేట్ ఫ్రెండ్షిప్ బ్రదర్ హుడ్ రెండు పాత్రల మధ్య వున్న అనుబంధం.. మా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన సినిమాల్లో వన్ ఆఫ్ ద ఫైనెస్ట్ మూవీ ఇది' అన్నారు. ఇదే సందర్భంగా దర్శకుడు రాజమౌళి గురించి వెల్లడిస్తూ తను ఇండియన్ సినిమాకు స్పీల్ బర్గ్ అని అభివర్ణించాడు.అంతే కాకుండా తను చేస్తున్న నెక్స్ట్ మూవీ గ్లోబల్ సినిమా అని క్లారిటీ ఇచ్చేశాడు. 'నాటు నాటు' సాంగ్ హ్యూజ్ హిట్ అయింది. గోల్డెన్ గ్లోబ్ అవార్డునీ దక్కించుకుని ఆస్కార్ బరిలో నిలిచింది. అంతే కాకుండా లేడీ గగా వంటి పాప్ స్టార్స్ మనసు దోచింది. అని యాంకర్స్ అడిగిన ప్రశ్నకు చరణ్ సమాధానం చెబుతూ.. "ఆర్ ఆర్ ఆర్' ఇండియన్ సినిమాకు నివాళి.తొలిసారి భారతీయ సినిమాకు ఆస్కార్ గుర్తింపు లభించిందని తెలిపాడు. ఇది ఇండియన్ సినిమాకు జస్ట్ ద బిగినింగ్ అని చెప్పడం విశేషం. తన మొదటి చైల్డ్ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తనని ఇంటర్వ్యూ చేస్తున్న వాళ్లల్లో వున్న లేడీ డాక్టర్ జెన్నిఫర్ ఆష్టన్ డెలివరీ చేయనుందని తెలిపాడు. తన గైనకాలజిస్ట్. చరణ్ చెప్పడంతో తను కూడా ఉపాసనని కేర్ గా చూసుకుంటానని మీ ఫస్ట్ చైల్డ్ డెలివరీ తానే చూసుకుంటానని చెప్పడంతో అంతా నవ్వేశారు.

# న్యూయార్క్ లో మెగా కల్లోలం! చరణ్ కోసం ఫ్యాన్స్ పడిగాపులు!!

మొన్నటివరకూ నల్ల చొక్కా సాదా సీదా నలుపు ఫ్యాంట్ లో చెప్పులు లేకుండా కనిపించాడు. ఇంతలోనే ఇప్పుడు అతడు హాలీవుడ్ స్టార్లకు ధీటుగా సూటు బూటులో ఒక మెరుపులా ప్రత్యక్షమయ్యాడు. అది కూడా ఆకాశహార్మ్యాల వింత నగరం న్యూయార్క్ లో అడుగుపెట్టిన తీరు రాజసాన్ని తలపించింది. కార్పొరేట్ కంపెనీ సీఈవోలను తలదన్నే లుక్ తో అక్కడ విలాసంతో కూడుకున్న వాకింగ్ తీరు వ్వావ్ అనిపించింది. అంతేకాదు.. తన రాక కోసం అభిమానులు గంటల కొద్దీ సమయం వెచ్చించి పడిగాపులు పడ్డారు. ఈ ఎపిసోడ్ లో మగధీరుడు ఎవరో చెప్పాల్సిన పని లేదు.'ఆర్ ఆర్ ఆర్'స్టార్.. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ (చెర్రీ).అతడు అక్కడ అడుగుపెట్టగానే న్యూయార్క్ ఫోటోగ్రాఫర్లు వెంటపడి మరీ ఫోటోలతో ఫ్లాష్ లు మెరిపించారు. ఇక ఫ్యాన్స్ తాకిడిని ముందే ఊహించారో ఏమో.. చెర్రీ ముందస్తు జాగ్రత్తగా బాడీ గార్డులతో ఆ ప్రాంగణంలోకి అడుగుపెట్టడం చూస్తుంటే అతడి రేంజు ఎలా స్కైని టచ్ చేస్తోందో ఊహించాలి. ఇన్నాళ్లు హైదరాబాద్ - చెన్నై-ముంబై- బెంగళూరు అంటూ మెట్రోల్లో మన స్టార్ హీరోలకు ఈ రేంజు ఫాలోయింగ్ కనిపించింది. కానీ ఇకపై న్యూయార్క్- కాలిఫోర్నియా - లాస్ ఏంజెల్స్ సహా ఇంకా ఎన్నో అమెరికా నగరాల్లో చరణ్ పేరు మార్మోగిపోనుంది. లండన్- ప్యారిస్- హాంకాంగ్- జపాన్ - చైనా- ఆస్ట్రేలియాలోను హాలీవుడ్ స్టార్లకు ధీటుగా ఇప్పుడు చరణ్ పేరు మార్మోగుతోంది. ఇకపైనా అతడు దీనిని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాల్లో ఉన్నాడు.నా రాజమౌళి 'ఆర్ ఆర్ ఆర్' తో ఏదైనా సాధ్యమేనని నిరూపణ అవుతోంది. చిత్రబృందం నుంచి రామ్ చరణ్ హాలీవుడ్ క్రిటిక్స్ అవార్డుకు హాజరు కావడానికి ముందే ఇటీవల న్యూయార్క్ నగరంలోని 'గుడ్ మార్నింగ్ అమెరికా స్టూడియో'ని సందర్శించారు. అతడు స్టూడియో వెలుపలకు వచ్చిన వెంటనే ఎంతో ఉత్సాహంగా వేచి ఉన్న అభిమానులు ఎంతో సందడిగా స్వాగతం పలికారు. దేశం కాని దేశంలో విదేశంలో అభిమానుల ప్రేమాభిమానాలకు రామ్ చరణ్ ఆశ్చర్యపోయాడు. ఓవైపు అమెరికాలో చలిగాలతో మైనస్ డిగ్రీల పరిస్థితి ఉన్నా ధైర్యంగా ఎదుర్కొని తన రాక కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తుండగా.. చరణ్ వారి వైపు చేతులు ఊపుతూ కొందరితో కరచాలనం చేశాడు. అలాగే అందరితో కలిసి సెల్ఫీ కూడా దిగాడు. నిజానికి అంతకుముందే రామ్ చరణ్ తన కారులోంచి దిగగానే పెద్ద సంఖ్యలో జనం ఆయనకు స్వాగతం పలికారు. భారతీయ అభిమానులతో పాటు అమెరికన్లు కూడా చరణ్ కు స్వాగతం పలికారు.ఈ వీడియో ఇంటర్నెట్ లో కనిపించిన వెంటనే ప్రపం చవ్యాప్త మెగాభిమానుల నుంచి ప్రశంసలు కురిసాయి. 'భారత సినిమాకు గర్వకారణం మీరు!'అని ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. "ఆల్వేస్ రామ్చరణ్ అన్న ఇక ఎప్పుడూ ఎక్కడా ఆగడు.. దూసుకెళతాడు! అంటూ అభిమాని కాన్ఫిడెంట్ గా తనకు మద్దతు నిచ్చారు.ఆస్కార్ రేసులో బజ్ పెంచేందుకేనా?95వ అకాడమీ అవార్డుల వేడుకకు హాజరయ్యేందుకు ముందే అమెరికా వెళ్లిన రామ్ చరణ్ స్టైలిష్ గా అక్కడ లొకేషన్లలో సంచరిస్తూ అందరి మనసులు దోచేస్తున్నాడు. రామ్ చరణ్ తో పాటు బాడీగార్డ్ ల బృందం అతడితో పాటు కనిపించడం ఆసక్తికరం. న్యూయార్క్ ట్రిప్ లో లేత గోధువ ంరంగు టీ-షర్ట్ - బూడిద రంగు ప్యాంట్-సూట్ ధరించి రామ్ చర ణ్ డాషింగ్ లుక్ తో కనిపి ంచాడు. సన్ గ్లాసెస్ ధరించి హాట్ మ్యాకోవ వ్యాన్ ని తలపిం చాడు.



# ఎన్టీఆర్ మూవీ హీరోయిన్ డేట్ ఫిక్స్




ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్లో ప్రస్తుతం మూవీ తెరకెక్కబోతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆర్ ఆర్ ఆర్ తర్వాత ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న జూనియర్ ఎన్టీఆర్ కొరటాల శివ కథ పైన ప్రత్యేక దృష్టి పెట్టాడు.కచ్చితంగా పాన్ ఇండియా ఇమేజ్ కి దగ్గరగా ఉండేలా యూనివర్సల్ అప్పీల్ ఉండే విధంగా స్టోరీ కథాంశాన్ని కొరటాలతో సిద్ధం చేయించారు. ఇదిలా ఉంటే గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన అప్డేట్స్ బయటకు వస్తూనే ఉన్నాయి.ఈ మూవీ ప్రారంభోత్సవం ఫిబ్రవరి నెల ఆఖరిలో జరుగుతుందని మార్చి 20 తర్వాత షూటింగ్ ప్రారంభిస్తామని తారక్ కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ సినిమాకి సంబంధించిన సెట్ వరకు ప్రస్తుతం హైదరాబాద్ లో జరుగుతుంది.ఈ మూవీ కోసం ప్రత్యేకంగా ఒక ఐలాండ్ ని సిద్ధం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కంప్లీట్ ఫిక్షనల్ బ్యాక్ డ్రాప్ లో మూవీ కథని కొరటాల శివ రెడీ చేశారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన క్యాస్టింగ్ ప్రస్తుతం ఫైనల్ చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తుంది.ఈ సినిమాలో హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ని ఖరారు చేసినట్లు సమాచారం. అలాగే ప్రతినాయకుడిగా బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ని ఫైనల్ చేసినట్లుగా టాక్ వినిపిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా మరో ఇంటరెస్టింగ్ అప్డేట్ తెరపైకి వచ్చింది మార్చి ఆరవ తేదీన ఈ సినిమాకు సంబంధించి హీరోయిన్ ని పేరు అనౌన్స్ చేయబోతున్నట్లుగా టాక్ వినిపిస్తుంది.జాన్వీ కపూర్ ఖరారు అయిన కూడా అఫీషియల్ గా పోస్టర్ ద్వారా ఆమె లుక్ ని రివీల్ చేయబోతున్నట్లుగా తెలుస్తుంది. ఈ సినిమా కోసం ఇప్పటికే జాన్వీ కపూర్ కి లుక్ టెస్ట్ కూడా జరిగినట్లుగా సమాచారం. అదే లుక్ ని ఇప్పుడు ఆరవ తేదీన ఫస్ట్ లుక్ పోస్టర్ గా రిలీజ్ చేసే ఛాన్స్ ఉన్నట్లుగా ఫిలింనగర్ సర్కిల్లో వినిపిస్తుంది.

# టెస్టుల్లోనే కాదు వన్డేలకు అతడి వైస్ కెప్టెన్ చేయాలి.. అవసరమా? అప్పుడేం జరిగిందో చూశాం కదా!



"అతడి ఆటతీరును ఒకసారి గమనించండి. అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. టెస్టుల్లోనే కాదు..వన్డేల్లో కూడా అతడిని వైస్ కెప్టెన్ చేయాలి. టీమిండియా వైస్ కెప్టెన్గా ఇంతకంటే బెటర్ ఆప్షన్ ఇంకొకటి దొరకదు" అని టీమిండియా మాజీ బౌలర్ హర్భజన్ సింగ్ అన్నాడు.బోర్డర్- గావస్కర్ ట్రోఫీ సిరీస్లో ఆకట్టుకుంటున్న స్టార్ ఆల్‌రౌండర్ రౌండర్ రవీంద్ర జడేజాను వైస్ కెప్టెన్ చేయాలని మేనేజ్మెంట్కు సూచించాడు. ప్రతి మ్యాచ్‌లోనూ జడ్డూ తుదిజట్టులో ఉంటే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని అభిప్రాయపడ్డాడు.ఆస్ట్రేలియాతో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. బంతితోనూ, బ్యాట్‌తోనూ మ్యాజిక్ చేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గాయం కారణంగా చాలాకాలం జట్టుకు దూరమైన జడేజా.. పునరాగమనంలో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు.సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో రవీంద్ర జడేజాపై హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. ఇప్పటికే కేఎల్ రాహుల్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తప్పించినట్లు బీసీసీఐ సంకేతాలు ఇచ్చిన వేళ.. జడేజాకు ఆ బాధ్యతలు ఇవ్వాలని సూచించాడు.కేవలం టెస్టులకే పరిమితం కాకుండా.. వన్డేల్లోనూ రోహిత్ శర్మకు డిప్యూటీగా నియమించాలని భజ్జీ విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ.. "తుది జట్టులో తప్పకుండా చోటు దక్కించుకునే ఆటగాడిని వైస్ కెప్టెన్ చేస్తే బాగుంటుంది.స్వదేశంలో, విదేశాల్లోనూ రాణించగల ప్రతిభ జడేజా సొంతం. అందుకే అతడిని తప్పకుండా వైస్ కెప్టెన్ చేయాలి. సీనియర్‌గా ఎల్లప్పుడూ జట్టుకు సేవలు అందిస్తూ ఉంటాడు" అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.అయితే, విశ్లేషకులు, అభిమానులు మాత్రం భజ్జీ సూచనపై మిశ్రమంగా స్పందిస్తున్నారు. "జడ్డూ అద్భుత ఆల్‌రౌండర్ అనడంలో సందేహం లేదు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190